# విముక్తి

ఊరంతా గుప్పుమంది. ఏ ఇద్దరెదురైనా ఇదే మాట్లాడుకొంటున్నారు. మూడో మనిషి కలిస్తే మాట మారుస్తున్నారు. బోరింగు కాడి ఆడవాళ్ళు చెవులు కొరుక్కొంటున్నారు. ఇళ్ళలో పెద్దవాళ్ళు లోగొంతుకతో రహస్యం చెప్పుకొంటున్నట్లు గుసగుసలాడుతున్నారు. పసులు తోలుకుపోతున్న జీతగాళ్ళు, సేద్దెగాళ్ళు తమకేమీ తెలియదన్నట్లు తలొంచుకుపోతున్నారు.

కరవమంటే కప్పకోపం, విడవమంటే పాముకు కోపం. మాకెందుకు వచ్చిన తంటా అన్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రమాదం లేకపోయినా భయముంది. యమ్మార్వో వచ్చి రాతకోతలు ముగించుకొన్నదాకా ఎవరినోటి వెంట కూడా మాట పెగిలేటట్లు లేదు.

రెండు బలాల మధ్య మాటామాట వచ్చి, ఏర్పడ్డ పందెంలో ఎవరు గెలిచినా, ఓడినా అది ఊరంతటికి జయంగానో పరాజయంగానో ఉండటం ఖాయం. భయంగానో, నిర్భయంగానో ఉండటం పరిపాటి.

పొద్దున్నే ఊరంతా ఆందోళనగా ఉంది. భయంతో నిండిన సంతోషం విచారం కలగలసిపోయి ఉంది. పదిచోట్ల పొట్టేళ్ళు తెగాయి. పండగకానిరోజు అన్ని పొట్టేళ్ళు తెగవు. ఆరోజు ఏ పండగా లేదు. ఆదివారం కూడా కాదు. అది ఉత్సాహమా – చెప్పలేం. ఉత్సవమా – కాదు. కావచ్చు. పండగే!

వారం రోజుల కిందట రామప్ప రమణప్ప మాటామాటా పెరిగి, పోటీపడి, పందెం కాసుకొన్న విషయం ఊరంతటికీ తెలుసు.

*   *   *

రెండు లక్షలిస్తే, ఇస్తామంటే, ఏ రైతు అయినా ఆత్మహత్య చేసుకొంటాడని రామప్ప అన్నాడు.

రెండు లక్షలు కాదు, ఇరవై లక్షలిస్తామన్నా – దుడ్డు కోసం ఏ రైతూ ప్రాణం తీసుకోదని రమణప్పఅన్నాడు.

ప్రభుత్వం ఇస్తామని చేసిన పరిహార ప్రకటనవల్ల రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నాడు రామప్ప.

పరిహారం కోసం ఎవరూ ప్రాణాలు వదలరు అన్నాడు రమణప్ప.

'దుడ్డెవ్వునికీ చేదుగాదు'.

'ప్రాణం ఎవ్వనికేగాని తీపే'

చేసిన అప్పులు తీర్చలేక చచ్చేకంటే, చచ్చి ప్రభుత్వం ప్రకటించిన పరిహారంతో అప్పులు తీర్చి ఋణవిముక్తుడౌతాడు రైతు.

బతికి ఉండటానికి ఏ రైతు అయినా అప్పు తీరుస్తాడు. చావటానికి కాదు. చచ్చి తీర్చాలని కాదు. అప్పు తీర్చాలని చావడు.

చస్తాడు! జీవితాంతం ఈ వ్యవసాయం చేసినా అప్పులు తీర్చలేడు. చావే దిక్కు. ఈ వ్యవసాయంతో రెండు లక్షలు సంపాదించలేడు. బ్రతికి దండగ. పిల్లల్ని చదివించలేడు. కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయలేడు. బేంకులవాళ్ళ గోల భరించలేడు. అప్పులవాళ్ళ ఆగడం తట్టుకోలేడు. ఏడుస్తూ కూడా ప్రాణప్రదమైన పశువుల్ని కబేళాలకు తోలకుండా ఆపలేడు. ఆకలితో అలమటించి చావకుండా ఉండలేడు. తాను చస్తే రెండు లక్షలు వస్తుందంటే ఏ రైతు అయినా చస్తాడు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయి -

ఆత్మహత్యలు పెరగవు. రైతులు చావరు. ఏ ఏటికయినా తగిన వాన రాకపోతుందా, బావులు, చెరువులు నిండకపోతాయా, పంటలు పండకుండా ఉంటాయా, ఇబ్బడిముబ్బడి పంట చేతికందకపోతుందా, కొడుకుల్ని పై చదువులకు పంపకపోతానా, కూతుళ్ళ పెళ్ళిళ్ళు ఘనంగా చేయకపోతానా, అప్పులన్నీ తీర్చకపోతానా, పసులకు చాలినంత మేత ఉండకపోతుందా అని ఆశతోనే జీవిస్తాడు కానీ, రెండు లక్షల కోసం చావడు.

వాదులాడుకొంటున్న రామప్ప, రమణప్ప కదిరిరోడ్డు మీద ఉన్న ఆర్.టి.సి. బస్సు షెల్టరులో నుంచి బైటికి వచ్చి ఇంటి తోవపట్టారు.

అయితే రైతులు పురుగుల మందులు తాగి ఎందుకు చస్తున్నారో? చెప్పమని రామప్ప అడిగితే, అప్పులవాళ్ళతో యాగలేక, ఇంటి కష్టాలు తీర్చలేక, ప్రాణం మీద తీపి చచ్చి అని చెప్పాడు రమణప్ప.

రైతు బాధల వల్ల చచ్చేకంటే, చచ్చి బాధలు తొలగించవచ్చుకదా!

ఏ రైతు అయినా బాధలు తొలగి బతకాలని చూస్తాడు కానీ సమస్యలు పరిష్కరించుకోవటానికి సాధ్యమైతే, సాధ్యమేనని ఆశ ఉంటే చావడు.

నువ్వెన్నయినా చెప్పు, ప్రభుత్వం ప్రకటించిన పరిహారంవల్ల రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయి-రామప్ప. అతను రాజకీయంగా తెలుగుదేశం అభిమాని.

పెరగవు. రైతు ధైర్యంగా ఉంటాడు. తమను ఆదుకొనే ప్రభుత్వం ఉందని నిర్భయంగా బతుకుమీద ఆశతో జీవిస్తాడు-రమణప్ప. అతను పుట్టకముందే వాళ్ళింట్లో కాంగ్రెస్ పుట్టింది.

ఇద్దరూ మాట్లాడుకొంటూ ఆకుతోట పల్లెలోకి వచ్చారు. రావిచెట్టు కింది గుండు మీద కూర్చొని మనూళ్ళోనే రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వ పరిహారం కోసం జరుగుతాయి అన్నాడు రామప్ప.

జరగవు అన్నాడు రమణప్ప. పందెం అంటే పందెం అనుకొన్నారు. ఎంతంటె ఎంత అనుకొన్నారు. మూడు లక్షలంటే మూడు లక్షలు అనుకొన్నారు. వారం అంటే వారం అనుకొన్నారు.

వారం రోజుల్లోపల రైతు ఆత్మహత్య చేసుకొని చనిపోతే రమణప్ప రామప్పకు మూడు లక్షలు ఇవ్వాలి. చనిపోకపోతే రామప్ప రమణప్పకు మూడు లక్షలు ఇవ్వాలి. యం.ఆర్.వో. సాక్ష్యం. గ్రామంలో అన్ని కులాల పెద్దలు సాక్ష్యం. ఇద్దరూ రెండు చెక్కులు రాసి, చించి, యం.ఆర్.వో. చేతిలో పెట్టారు.

ఆకుతోట పల్లెలో వాళ్ళు ఇద్దరూ బాగా సంపన్నులు. రామప్ప తాతముత్తాతలు అంతగా ఉన్నవాళ్ళు కారు. పొలం పండి, పాలూ పెరుగు నెయ్యి అమ్మి, పైసాకు పైసా కూడబెట్టిన తల్లితండ్రులకు పుట్టిన రామప్ప, పుట్టటమే సంపన్నుడుగా పుట్టాడు. పంటలు, పాలు, పెరుగు, నెయ్యి కాక, డబ్బు వడ్డీలకిచ్చి ఆస్తిని పెంచేదేకానీ పోగొట్టలేదు. అసలు కంటే వడ్డీ వసూలు చేసుకోవటం రామప్ప దినచర్య. తన సొమ్ము తాను రాబట్టుకోవటానికి ఎంత కఠినంగానయినా ప్రవర్తించగలడు. మొండివాడనీ, పట్టుదల మనిషనీ, అప్పివ్వటంలో అందరివాడనీ, వసూలు చేయటంలో ఒంటరివాడనీ, పిల్లాపాపల్లేక ఆస్తి పెరుగుతూనే ఉంది కానీ తరగటం లేదనీ, తిండీతిప్పలు లేకపోయినా చింతలేదుకానీ, వడ్డీలు వసూలు కాకపోతే బక్కచిక్కి సగం చచ్చిపోతాడనీ, రామప్ప అంటే ఊళ్ళో అందరికీ భయం. ఊళ్ళో సగం మందికి రామప్ప అప్పులిచ్చాడు. ధర్మవడ్డీ రెండు రూపాయలు. పెంచడు, తగ్గించడు. మాట తప్పడు. మాట నిలబెట్టుకోమంటాడు. ఎప్పుడు వడ్డీ అడుగుతాడోనని అప్పు తీసుకొన్నవాళ్ళు దండం పెట్టి తప్పుకొంటారు. భయభక్తులు ప్రదర్శిస్తుంటారు. ఎవరైనా ఎదురుతిరిగినా, అప్పు ఎగరగొట్టే ప్రయత్నం చేసినా, వాణ్ణి ముప్పతిప్పలు పెట్టి, మూడునాళ్ళలో కాళ్ళబేరానికి వచ్చేట్టు చేస్తాడు. పిచ్చి పట్టుదల.

రమణప్ప పొలం ఆ కొండ నుంచి, ఈ కొండ దాకా ఉంది. చాలాభాగం చేనుగా కొంచెం తరిగా ఉంది. మోటబావులు, బోరులు ఎండకపోతే రమణప్ప కోటీశ్వరుడే. వానలు పడి పంటలు పండితే ఏడేళ్ళదాకా రమణప్ప లక్షాధికారే! ఏడేళ్ళలో ఒక సంవత్సరం సరిగ్గా పంటలు పండితే పది హత్యలయినా చేయించగలడు. రాయలసీమలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో పంటలు బాగా పండితే పాత కక్షలు కొత్తగా రెక్కలు తొడుక్కొని రాబందులై గ్రామాల మీద ఎగురుతాయి. కోర్టుల చుట్టూ తిరుగుతారు జనం. సెనక్కాయలమ్మితే, శవాలు మూట గట్టుకోవలసిందే! రమణప్పకు సెనిక్కాయ పంట చేతికొస్తే అగ్నిగోళంలా మండిపోతాడు. తేరిపార చూడటం సాధ్యం కాకుండా ఉంటాడు. రమణప్ప పూర్వీకులు పాలెగాళ్ళుగా ఉన్నారని ప్రతీతి. అందుకు తగినట్లుగా అతడి ఇల్లు కోటలాగా ఉంటుంది. పాతబడిపోయింది. పడగొట్టి కట్టాలంటే కష్టం ఏమీ లేదు. ఆ యింటికి వాడిన కలపలో సగం అమ్మినా అంతకంటే పెద్ద పిల్లర్ల ఇల్లు కట్టవచ్చు. రాజులు శత్రురాజుల్ని చంపి అతడి రాజ్యం తన రాజ్యంలో కలుపుకొన్నట్లు

పాలెగాళ్ళు పరాయివాడి సంపద వాళ్ళే సంహరించి తను సొంతం చేసుకొంటారు. అట్లా సంపాదించిన ఆస్తిగా రమణప్ప ఆస్తిని గురించి జనం చెప్పుకొంటారు. రమణప్ప కూడా దొంగతనాలు చేయించి ఆస్తిపాస్తులు తరక్కుండా చూచుకొంటున్నాడని జనం చెవులు కొరుక్కొంటూ ఉంటారు. ఊళ్ళో సగం మంది ఏదోవిధంగా తనమీద ఆధారపడ్డవాళ్ళే. పొలాల్లో పనులు, పశువుల పనులు, ఇంటి పనులు ఏదో ఒకటి చేస్తూ ఉండేవాళ్ళే పల్లెలో ఎక్కువమంది. పెళ్ళయినా పేరంటమయినా రమణప్ప దానం అంతో ఇంతో లేకుండా గ్రామంలో ఏ శుభకార్యం జరగదు. గ్రామస్థులకు రమణప్ప అంటే భయభక్తులెక్కువ.

వారం రోజుల్లోపల గ్రామంలో కనీసం ఒక్క రైతయినా ఆకలిచావు, అప్పులచావు, పురుగుమందు చావు చస్తాడనీ, చావడనీ సంపన్నులిద్దరూ పందెం కాసుకొన్నారని తెలిసి జనం వణికి చస్తున్నారు. రామప్ప మాట నెగ్గితే, రమణప్పతో ఇబ్బంది. రమణప్ప మాట చెలామణి అయితే రామప్పతో పేచీ! పల్లెకేదో మూడిందని జనం కుతకుతలాడి పోతున్నారు.

మనూళ్ళోవాళ్ళంతా ధైర్యస్థులని, ఎవడూ పిరికివాడు కాదని, చేసిన అప్పులు తీర్చలేక చచ్చిపోయే వాళ్ళు ఎవరు లేరని, అదంతా వారం రోజులల్లో ఋజువవుతుందని అందరికీ ధైర్యం నూరిపోస్తూ, పాపం రామప్ప అకారణంగా మూడు లక్షలు పందెం కాని పోగొట్టుకుంటున్నాడని రమణప్ప ఎగతాళి చేయసాగాడు. అంతటితో ఊరుకోలేదు. పూటగడవని వాళ్ళకు దానధర్మాలు చేయసాగాడు. చస్తారేమో అనుకొన్నవాళ్ళకు ఎన్నడూలేంది అప్పులీయసాగాడు. పాత అప్పు తీర్చటానికి కొత్త అప్పు ఇయ్యటం లేదు కానీ కష్టాల్లో ఉన్నవాళ్ళను ఆదుకోసాగాడు.

ఆకుతోట పల్లెలో ఉన్నవాళ్ళంతా పేద రైతులు. మూడేళ్ళుగా వానల్లేక, పంటల్లేక, పశుగ్రాసం లేక, తిండి గింజలు లేక, ప్రకటించని కరువు కాటకంతో అగచాట్లు పడుతున్నారు. అందరూ అప్పులు, చేబదుళ్ళు, బేంక్ లోన్లు చేసినవాళ్ళే! అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నవాళ్ళే! సగం మంది తనకే అప్పు పడ్డారు. వాళ్ళలో ఎవరైనా చచ్చిపోయే అవకాశం లేకపోలేదు. ఎవరు చచ్చిపోదగ్గవాళ్ళున్నారు? చూచుకోసాగాడు రామప్ప. తనకు బాకీ పడ్డ వాళ్ళనందరినీ ఇంటికి పిలిపించుకొన్నాడు. అప్పు తీర్చమన్నాడు. వడ్డీ కాదు, అసలు కూడా ఇమ్మన్నాడు. రెండురోజుల్లో ఇచ్చితీరాలన్నాడు. ఇవ్వకపోతే ఊరుకోనన్నాడు. ఇస్తారో చస్తారో మీ ఇష్టం అని తేల్చి చెప్పాడు. ఏం చేయటంరా దేవుడా అని రైతులు నానా ఇబ్బందులు పడసాగారు. చచ్చి అయినా అప్పు తీర్చమంటున్నాడు.

అప్పుడే రెండు రోజులు గడిచిపోయాయి. ఏ రైతూ చచ్చిన జాడలేదు. తన అప్పు తీరాలంటే బాకీపడ్డవాళ్ళు చావాలి. ఎందరు చస్తే అంతగా బాకీ వసూలవుతుంది. వాళ్లు చస్తే ప్రభుత్వం పరిహారం ఇస్తుంది. ఆ సొమ్ము తెచ్చి వాళ్ళు తన బాకీకి జమ చేస్తారు. అందువల్ల రామప్ప అప్పుబడ్డ రైతుల్ని మాటిమాటికి హెచ్చరిస్తున్నాడు. బెదిరిస్తున్నాడు. చస్తారో బ్రతుకుతారో

నా సొమ్ము నాకు కట్టండి అని సతాయిస్తున్నాడు. తప్పించుకొని తిరుగుతున్నవాళ్ళను బొడ్లో చేయేసి నిలబెట్టి అప్పు చెల్లించమంటున్నాడు. ఊరికే వదలనని బెదిరిస్తున్నాడు.

రామప్ప ఏం చేయగలడు? వాడి బెదిరింపు లేమాత్రం? మీరు అప్పు తీర్చవద్దు! వడ్డీకూడా కట్టవద్దు! వాడి అప్పు తీర్చటానికే మీరు చనిపోయి ఏం సాధించినట్లు? మీరు బతకాలి! వర్షాలు వస్తాయి. పంటలు పండుతాయి. అప్పుడు అప్పు తీర్చండి. ఒకడికి బాకీపడి మీరు చావకూడదు. మీకు నేను అండగా ఉంటాను. మీకేం కావాలన్నా నన్ను అడగండి. అన్నీ నేను చూచుకొంటానని రమణప్ప భరోసా ఇచ్చాడు. రామప్ప మిమ్మల్ని చంపాలని చూస్తున్నాడు.మీరు చావరాదు అని తీర్మానించాడు.

రామప్ప మాట నెగ్గితే పరిహారంగా వచ్చే డబ్బుతో కొంత బాకీ తీరేమాట నిజమే.అంతేకాదు పందెం డబ్బు మూడు లక్షలు అప్పనంగా వస్తుంది. రమణప్ప మాట జరిగితే తనకే బాకీ తీరదు కానీ పేద పిడకలు అమ్మి సొమ్ము జమచేసిన వాడి పాపిష్టి డబ్బు మూడు లక్షలు తన సొంతం అవుతుంది. లెక్క ఎవడికి చేదు?

ఈ పందెం సొమ్ము ఆశ వాళ్ళిద్దరికీ ఉండటం ఊళ్ళో అందరికీ తెలుసు. ఎవరూ ఏమీ అనరు. వాళ్ళలో ఎవరికో ఒకరికి కోపం తెప్పించటం ఊరికి మంచిది కాదని అందరికీ తెలుసు.

రైతులు చస్తే రామప్ప పందెం గెలుస్తాడు. రైతులు చనిపోకపోతే రమణప్ప గెలుస్తాడు. రైతుల్ని చంపాలని బాకీలు తీర్చమంటున్నాడు రామప్ప. రైతులు బతకాలని అప్పులు తీర్చవద్దని రమణప్ప వాళ్ళను రేపుతున్నాడు. రైతులు చావాలని రామప్ప, బతకాలని రమణప్ప తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.చావదగ్గ పరిస్థితులున్నవాళ్ళను గుర్తించటానికి రామప్ప తీవ్రంగా పరిశీలిస్తున్నాడు.

అనంతపురం చుట్టుపక్కల గ్రామాలకు సాగునీటి సదుపాయం లేదు. చెరువుల, దొరువుల ఆచూకీ లేదు. బావులు ఎండిపోయాయి. రిగ్గులు మాయమయ్యాయి. వాననీరే ఆధారం. మెట్ట పంటలే దిక్కు. వాన కురిస్తే పంట. లేకుంటే కరువు. వర్షం పడిందా సెనక్కాయకు ఢోకా లేదు. ఈమధ్యే పొద్దుతిరుగుడు పూవు సేద్యం కూడా మొదలయింది. వాన కురవకపోతే పశుగ్రాసం కూడా కష్టమే!

తాహతున్న రైతులు బోర్లు చేయించుకుంటే, తాహతు లేనివాళ్ళు అప్పులు తెచ్చి బోర్లు వేయించుకొన్నారు. అదృష్టం మీద ఆధారపడి బోర్ల కింద జరిగిన సేద్యం నాలుగైదేళ్ళలో నామరూపాల్లేకుండా పోయింది.

అంతో ఇంతో తడి ఉన్న బోర్లు కూడా కరెంటు కోతతో మూలనపడ్డాయి. పండిన పంట దళారుల చేతుల్లో పడి గిట్టుబాటు ధర లేక తలకాయ నొప్పిగా మారింది. వచ్చిన

సొమ్ము వడ్డీలకు సరిపోకపోగా తిండిలేని సన్నకారు రైతులు ఆకలికి అలమటించేవాళ్ళుగానే ఉండిపోతున్నారు. వ్యవసాయం పెద్ద జూదంగా మారింది.

సంపన్నులు చేలు పండినా, తరి పండినా రెండు మూడేళ్ళకు భయం లేదు. సామాన్యులైన రైతుల బ్రతుకే దుర్భరంగా మారింది. పొలం పండితే కడుపు నిండే రైతులు ఆకటికి అలమటిస్తున్నారు. ఆ రైతుల జీవితాలు దినగండంగా ఉంటే పండుగలూ పబ్బాలు ఎవరూహించగలరు? చదువుసంధ్యలు ఎక్కడ సాగుతాయి? పెళ్ళిళ్ళు పేరంటాలు ఏం జరుగుతాయి? ఈడేరిన ఆడబిడ్డలు గుండెలమీద కుంపట్లుకాగా, అప్పోసప్పో చేసి, కన్న ఋణం కడుపుతీపి తీర్చుకొన్న రైతులు అప్పులు, వాటి వడ్డీలు తీర్చలేక విరక్తిపుట్టి, బతుకు చాలించే దౌర్భాగ్యం లేనిదెక్కడ?

ఆకలి బాధ భరించలేనిది. అప్పుల బాధ బ్రతకనీదు. నిరాశానిస్పృహలు మనుష్యుల్ని నిలువునా కుంగదీస్తున్నా, బ్రతుకు మీద తీపి, ప్రాణం మీద ఆశ, రైతుల్ని చావు బ్రతుకుల వాకిట్లోకో, బయటికో, లోపటికో నెడుతున్నాయి. దేశానికి అన్నం పెట్టే రైతు, దేశానికి వెన్నెముక అయిన రైతు, వెన్నెముక విరిగి రైతు కాకుండా పోసాగాడు.

రైతు అహాన్ని చంపుకొని కూలీగా మారాడు. హమాలీ అయ్యాడు. మూటలు మోశాడు. సైకిల్ రిక్షా తొక్కుతున్నాడు. ఆటో కోసం అప్పులు చేస్తున్నాడు. టీ బంకులు నడుపుతున్నాడు. క్లీనరుగా మారాడు. సర్వరు అయ్యాడు. యాచన కూడా చేస్తున్నాడు. అయినా బతుకుతూనే ఉన్నాడు. చావటంలేదు. రామప్పకు నిరాశ.

ఆకుతోట పల్లెలో చాలామందికి వ్యవసాయముంది. కమ్మ రెడ్డి బలిజ రైతులు కొద్దిమందే! బోయ కురవ రైతు లెక్కువమంది ఉన్నారు. కమ్మరి కుమ్మరి చాకలి మంగలి వాళ్ళు కులవృత్తులు చేసుకొంటూ వ్యవసాయం కూడా చేసుకొంటూ ఉండారు. కరణమయ్య తప్ప బ్రాహ్మణులు లేరు. సాయిబులకు పొలాలు లేవు. వాళ్ళలో కొందరు దూదేకులవాళ్ళు. దూదేకే పని లేనప్పుడు సాయిబులంతా వ్యవసాయ కూలీలు. నేసేవాళ్ళలో నేర్పున్నవాళ్ళు కొద్దిమంది. వాళ్ళకు ధర్మవరం పట్టుచీరెలు బాగా నేసే పేరు ప్రఖ్యాతులున్నాయి. నేసిన చీర నేసినట్లు ధర్మవరం షాపుల్లో ఇచ్చేస్తారు. నేసిన కూలీ తీసుకొని వస్తారు. వాళ్ళకు వ్యవసాయం తక్కువ. మంటొడ్డోళ్ళు రెండు కుటుంబాలే!

ఆకుతోట పల్లెలో నాలుగోంతు మాదిగవాళ్ళున్నారు. వాళ్ళలో చాలామందికి వ్యవసాయం ఉంది. పంటలు లేనప్పుడు కులవృత్తి చేసుకొంటారు. మాదిగల కులవృత్తి ఉత్పత్తికి తగినంతగా ఊరు లేదు. అనంతపురంలో చెప్పులు అమ్ముకుంటారు. షాపుల్లో చెప్పులు జనం కోరుకొంటారు కానీ, అగ్గవగా దొరికే చెప్పులంటే మాదిగల దగ్గరే ఉంటాయి. వయస్సు వచ్చిన మాదిగలకు ఇద్దరు ముగ్గురు భార్యలుంటారు. తినటానికి ఉంటే పనిచేయరు. తాగుతారు. ఇల్లు వదలరు. ఇంట్లో గింజలు లేకపోతే ఆరెవారు కత్తిరాయి గూటం తోలుసంచీ తీసుకొని అనంతపురం

పోతారు.రోడ్డు పక్కన చేరతారు. పాత చెప్పులు రిపేరు చేస్తారు. కొత్త చెప్పులు అమ్ముతారు.

వానల్లేక వ్యవసాయం లేక తిండీ తీర్థం లేక రైతులు వేరే పనుల్లు చేయలేక, చేతకాక అల్లాడి పోతుంటారు. ఆకుతోట పల్లె రైతులతో పాటు కరువు కాటకాలకు బలయ్యేది వ్యవసాయ కూలీలు ముఖ్యంగా సాయిబులు. మాదిగోళ్ళు ప్రభుత్వం నుంచి ఏ రాయితీలు రానిజనం వాళ్ళు సాయిబులు.

కమ్మరికి కుమ్మరికి చాకలికి మంగలికి ఆకుతోటపల్లె కంటే అనంతపురంలోనే పని, బ్రతుకుదెరువు. అంతంతమాత్రంగా పని. కొంతలో కొంత మేలు తిండి గింజలు తెచ్చుకుంటారు. కుమ్మర్లు వీధి వీధికి తిరిగి కుండలు, బానలు, కడవలు, చట్లు, పిడతలు, ముంతలు, మూకుళ్ళు అమ్ముతూ ఉంటారు. అనంతపురం జనానికి మట్టి పాత్రలు అక్కరలేదు. ఇత్తడి, రాగి పాత్రలు, ఈమధ్య స్టీలు పాత్రలు కొనుక్కొంటున్నారు. పేదలు జర్మన్ సిల్వరు పాత్రలు తీసుకొంటున్నారు. ఎవరో పాతకాలం మనుషులు మట్టి పాత్రలు ఎండాకాలంలో కావాలంటారు. వాళ్ళే కుమ్మర్ల పోషకులు.

మంగళ్ళు పొది తీసుకొని ఊర్లో తిరుగుతారు. గుడి దగ్గరా, రోడ్డు వారా, రైలు కట్ట పక్కనా కూర్చుని గడ్డం గీస్తారు. క్రాపు చేస్తారు. గుండు గీస్తారు. మంగలి షాపుల్లో అద్దాల మధ్య అందాలు చూచుకోదలచినవాళ్ళు వీళ్ళ దగ్గరకు రారు.

లాండ్రీలున్నా చాకళ్ళ పని జరుగుతూనే ఉంది. ఇంటి ఇంటికి తిరిగి అక్కడే బట్టలు పిండి ఆరేసి కూలీ తీసుకొని వస్తున్నారు. కొందరు సైకిలు చక్రాల బండి వేసుకొని ఇస్త్రీ పెట్టె పెట్టుకొని వీధి వీధికి తిరిగి ఏ యింటి బట్టలు ఆ యింటికాడే ఇస్త్రీ చేసి ఇచ్చేసి ఎంతో కొంత సంపాదిస్తున్నారు.

సాలెవాళ్ళు నేసేపని దొరికిందాకా ధర్మవరంలో ఉండి, పని దొరగ్గానే గ్రామానికి వచ్చి పని చేసుకుపోతున్నారు. సాలోళ్ళ పని చావటానికి లేదు. బతకటానికీ లేదు.

కమ్మ, రెడ్డి, బలిజ కులాల రైతులు వానల్లేకపోతే బాగా దెబ్బ తింటున్నారు. వీళ్ళు అనంతపురం చేరి పశువులు మేపుకొంటూ పాలమ్ముకొంటూ బ్రతుకుతున్నారు. కొందరు హోటళ్ళు పెట్టి రేట్లు తగ్గించి టిఫిన్, మీల్సు వండి, వార్చి, వడ్డిస్తున్నారు. బండి మీద పొయ్యి పెట్టుకొని, ఇడ్లీలు, వడలు, బజ్జీలు వేసి రోజంతా అమ్ముకొంటున్నారు.మసాలా బొరుగులు రుచిగా చేస్తున్నారు. పకోడి, కారబ్బూంది లడ్డులు మైసూరుపాకులు అమ్ముతున్నారు. కరణయ్య తిమ్మిని బమ్మిని చేసి, బమ్మిని తిమ్మిని చేసి పల్లెలోనే బ్రతుకీడుస్తున్నాడు.

మాదిగలు మునిసిపాలిటీలో స్వీపర్లుగా పాకీలుగా పనిచేస్తున్నారు. మగా ఆడ తేడా లేకుండా ఈ పని చేస్తున్నారు. ఈ దేశంలో ఇదొక్కటే పోటీలేని పని. ఈ పని చేయటానికి ఎవరూ ఎగబడరు. ఒకళ్ళిద్దరు బలిజోళ్ళు గాజుల షాపులు పెట్టారు. ఆకుతోటపల్లెలోని సాయిబుల అమ్మాయిలు, మాదిగల ఆడపిల్లలు బొంబాయిలో అమ్ముడుపోయారని

చెప్పుకొంటారు. నిజం తెలియదు. నిలకడ మీద తెలవచ్చు. ప్రస్తుతానికి నలుగురు ఈడేరిన ఆడపిల్లల పత్తా లేదు.

ఊరొదిలి దూరప్రాంతాలకు పోయిన వాళ్ళు అక్కడెట్లా బ్రతికినా, అప్పుడప్పుడూ పల్లెకు వచ్చి, తల్లిని చూచి, తల్లిలాంటి పల్లెను చూచి, అభిమానం చంపుకోలేక నాలుగునాళ్ళుండి, తెచ్చింది ఇచ్చి, కన్నీళ్ళను తీసుకొని, పల్లెను వదిలి పట్టణాలవైపు సాగిపోసాగారు.

అనంతపురంలో ఆ పనీ ఈ పనీ చేసుకొంటున్న వాళ్ళు రోజూ ఆకుతోట పల్లెకు రావటం లేదు. అమావాసకో, పున్నానికో, పండక్కో, పబ్బానికో వస్తారు. ఆకుతోట పల్లె మొక్కలు తమని తాము పెరుక్కొని పట్నాలలో నాటుకొని, అక్కడ ఇమడక, బతికీ బతక్క అవస్థలు పడుతున్నారు.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఆత్మహత్యలు చేసుకొన్న రైతు కుటుంబాలను ఆదుకోవటానికి పరిహారం ప్రకటిస్తే, దాన్ని పొంది కుటుంబమైనా కష్టాల కడలి నుంచి ఒడ్డెక్కుతుందని రైతులు ఎక్కడెక్కడో పురుగులమందు తాగి మరణించారని, మునుముందు మరింతమంది, మరిన్నిచోట్ల చనిపోతారని పేపర్లలో రాస్తుంటే రమణప్పకు కోపం వచ్చింది. రామప్పకు ఉత్సాహం కలిగింది.

గ్రామంలో తను అప్పులిచ్చిన జనంలో చావదగ్గ వాళ్ళ కోసం పరికించి చూస్తున్న రామప్ప దృష్టి సాయిబులు మాదిగల మీద పడింది. చాలాకాలంగా అప్పుతీర్చలేక, ఎంతో కొంత వడ్డీ కట్టి, పత్రాలు తిరగరాయించుకొన్నవాళ్ళలో నలుగురి మీద చూపు పడింది. అందులో ఇద్దరు అనంతపురం పోయి రెండు వీధి మూలల్లో కట్టెలు నాటి ఆకు కప్పి, షాపు అని పేరు పెట్టి, పొట్టేళ్ళు తెచ్చి, కోసి, అమ్మి కూటికింత సంపాదించుకొని, పొట్లి డబ్బు కట్టేసి, ఏదోవిధంగా బతుకుతున్నారు. వాళ్ళను చావమంటే చావరు. మిగిలిన ఇద్దరిలో ఒకడు ముసలోడు. మరొకడు పాయపోడు. పాయపోన్ని చావమంటే చావడు. ముసిలోన్ని చావమంటే సావొచ్చు. పాయపోనికి నలుగురు పెళ్ళాలు. వాళ్ళు పనీ పాటూ చేస్తున్నారు. వాన్ని పోషిస్తున్నారు. ముసిలోని పెళ్ళాలు అయిదుమందీ కాటికి కాళ్ళరజాపి కూర్చున్నాడు. మగపిల్లలు అనంతపురం ధర్మవరం, బెంగుళూరు, హైదరాబాదు చేరి, సైకిల్‌షాపుల్లో, కారు గేరేజిల్లో కూలీనాలీ చేసుకొంటూ, రైల్వేస్టేషన్లలో బస్సు స్టేషన్లలో కూలీ మోస్తూ బతుకు ఈడుస్తున్నారు. ముసిలోని కూతుళ్ళు బొమ్మలులాగా ఉంటారు. పెద్దాయమ్మికి పెళ్ళయింది. నడిపాయమ్మలిద్దరూ నచ్చినోళ్ళు రమ్మంటే వెళ్ళిపోయారు. సన్నపాపలిద్దరు బొంబాయిలో చేయరాని పని చేసి కాలం ఎల్లదీస్తున్నారని వాళ్ళు వీళ్ళు చెప్పుకొంటూ ఉంటారు. ఇంట్లోంచి పొగరాక నాలుగు రోజులయింది. ఇంట్లో మూలన పడ్డవాళ్ళూ, కిటికీలకాడ కూలబడ్డవాళ్ళూ ఊరికే ఉండలేక అటు ఇటూ పారాడుతున్న ప్రాణులూ, అంత ఆడవాళ్ళు. బయట యాపచెట్టు కింద వయరు

మంచం మీద పడుకొన్న ముసిలోడు, ఇంటి యజమాని. ఐదుగురు పెళ్ళాల మొగుడు. పదిమంది పిల్లల తండ్రి, డెబ్బై అయిదేళ్ళ పాటుగాడు, కొనూపిరితో ఉన్నవాడు పకీరప్ప. రామప్పకు నచ్చాడు. చచ్చేవాడంటే వీడే అనుకున్నాడు. వీడు చచ్చినా ఎవడికీ నష్టం లేదు. చస్తే డబ్బొస్తుందిరా అంటే, ఎగిరి గంతేసి ఎగిరి ఆకాశంలోకి ప్రాణహంసను ఉసిగొలిపి పంపవచ్చు. పకీరప్ప చచ్చిపోతే తనప్పు తీరిపోతుంది. వాడి పెళ్ళాలకూ కొంతకాలం తిండితీర్థం దొరుకుతాయి. పకీరప్పను గురిపెట్టుకొని, ఎరతీసుకొని గేలం చేతబట్టుకొని రామప్ప బయలుదేరి వెళ్ళి పకీరప్ప వయరు మంచం మీద కూర్చున్నాడు.

పకీరప్ప మంచం మీంచి లేచాడు. దిగాడు. కింద కూర్చున్నాడు. 'ఇయ్యే గింజలు, గంజి గాసుకొండి' అంటూ మూట చేతిలో పెట్టాడు. ఇట్టా ఎట్టా జత్తారన్నాడు వివరాలన్నీ విడమరచి చెప్పాడు. బూబమ్మలకయినా బువ్వ ఉండల్ల వొద్దా అన్నాడు. అని నువ్వు చచ్చి సాధించగలవన్నాడు. అప్పు తీర్చగలవన్నాడు. బూబమ్మలికి బువ్వ పెట్టగలవన్నాడు. అనవసరంగా ఎప్పుడో చచ్చేకంటే, అవసరం కోసం రేపో మాపో చచ్చిపో అని, చచ్చి కుటుంబాన్ని బతికించమని, గీతోపదేశం, హితోపదేశం చేసి శ్రీకృష్ణ పరమాత్ముడిలా పోజుపెట్టి, చచ్చేవాడెవడూ, చంపేవాడెవరూ, వాడెనడో కంటికి కనబడని వాడికంటే కంటికి కనిపించే డబ్బే దైవమని, దేవుడి కోసం చావమని, చచ్చి, అల్లాని చేరుకొని సుఖంగా శాంతంగా బతకమని సలహా ఇచ్చాడు. సందేశం ఇచ్చాడు. పకీరప్ప చచ్చితీరాలని తీర్మానించుకొని, ఉత్సాహంగా లేచి, హుషారుగా పురుగులమందు తాగి, ఉత్తేజంగా చచ్చి, తేజాన్ని ఆకాశమార్గంలో పంపి, అల్లా ఆత్మలో కలిసి, భగవంతుల్లో లీనమయ్యే భక్తుళ్ళా మారిపోవాలని కోరుకొనేంత శక్తియుక్తులతో రామప్ప చెబితే విని పకీరప్ప వణికి పోసాగాడు. పిచ్చి అర్జునుడి దగ్గర పనిచేసిన గీతోపదేశం పనికిరాని, డబ్బులేని, తిండిలేని, బలహీనుడైన పకీరప్ప కాడ పనిచేయలేదని గుర్తించకపోవటానికి రామప్ప తెలివిలేనివాడేమీ కాదు. తెలివైనవాడే! తెలుసుకొన్నాడు. అందుకే ఇంట్లోకి చూశాడు. రెండు కిటికీలలో నుంచి కనిపిస్తున్న ఐదు తలకాయల్ని చూచి రామప్ప తలుపు తోసుకొని లోనికి పోయాడు.

ఆడాళ్ళు సాప తెచ్చి వేశారు. కూర్చోమన్నారు. రామప్ప కూర్చోలేదు. కూర్చోటానికా రామప్ప రావటం. ప్రాణం వెంట తీసుకుపోవటానికి! వివరంగా విషయం చెప్పి, రెండు లక్షలు సంపాదించుకొని, తన అప్పు తీర్చి, మిగిలిన సొమ్ముతో మీరు నాలుక్కాలాల పాటు జీవించమని కోరి, ముసిలోడు సచ్చినా సరే, మీరు సంపినా సరే' అన్నాడు. వాళ్ళు ఏడుపు లంకించుకొన్నారు. పకీరప్ప ఇంట్లోకి వచ్చాడు. చిన్న పెళ్ళాం. యాభై ఏళ్ళుంటాయి. బయటికిపోయి,యాప చెట్టుకింద ఉన్న వయరు మంచం తెచ్చి, గింజల మూట అక్కకు అందించి, మంచం వాల్చి, దుప్పటి వేసి, రామప్పను కూర్చోమంది. కూర్చోలేదు. రేపీపాటికి ఏ మాటా తేల్చి చెప్పమని రామప్ప బయటికి వచ్చాడు.

ఆడోళ్ళు తలుపు మూయకముందే పకీరప్ప మంచం మీద కూలబడ్డాడు. ఆళ్ళందరూ మంచం చుట్టూ చేరారు. ముక్కులు చీదుతున్నారు. మూతలు తుడుచుకొంటున్నారు. కుమిలి కుమిలి ఏడుస్తున్నారు. ఏడిసే ఓపిక కూడా లేదు. పొయ్యి ముట్టించారు. పొగ లేచింది. తలుపు మూసుకుంది. కిటికీలు మూతపడ్డాయి.

రామప్ప తెలుగుదేం పార్టీకి స్థానిక నాయకుడు కాకపూర్వం యన్.జి. రంగా పెట్టిన స్వతంత్ర పార్టీ సభ్యుడుగా ఉండేవాడు. అంతకుముందు కృషికార్‌లోక్ పార్టీకి పని చేశాడు. అంతకుముందు చీలిపోని కమ్యూనిష్టు పార్టీలో ఉన్నప్పుడు, స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో కేంద్రాలు నడిపి, బియ్యం బిచ్చమెత్తి తెచ్చి ఇదుకల్లు సదాశివన్‌తో పాటు అహోరాత్రులు శ్రమించాడు. ఆ శ్రమించిన రోజులకు గుర్తుగా, ఇన్ని పార్టీలలోకి మారిన రామప్ప ఇవాళ బియ్యం గింజల మూట గంజి కాసుకోటానికి ఇచ్చాడు. ఆరోజుల్లో బియ్యం బిచ్చమెత్తి తెచ్చాడు. ఇవాళ ఇంట్లోంచి తెచ్చాడు. ఆనాళ్ళలో బియ్యం మూటలు గంజి కేంద్రాలలో ఇచ్చాడు. ఇప్పుడు పకీరప్ప ఇంట్లో ఇచ్చాడు. అప్పట్లో ఆకలితో కష్టజీవులు పేదలు చావకుండా బ్రతకాలని ఇచ్చాడు. ఈరోజు పేదవాడు చావాలని కోరుతున్నాడు. ఆ కాలంలో స్వార్థం లేదు. పరార్థం ఉంది, పరమార్థం ఉంది. ఈ సమయంలో స్వార్థం ఉంది, పరార్థం ఉంది, పరమార్థం ఉంది. ఇంకా ఏవేవో ఉన్నాయని రామప్ప చెబుతున్నాడు.

పకీరప్పను తలుచుకొంటున్న రామప్పకు ఆశగానూ ఉంది. నిరాశగానూ ఉంది. వాడు చచ్చిపోవచ్చునని ఆశ. చావడేమోనని నిరాశ. చస్తాడని వీణ్ణి నమ్ముకొంటే చచ్చినట్లేనని వీణ్ణి నమ్ముకొని చావరాదని, చావదగ్గ మరొకణ్ణి చూచుకోవటం మేలని, రామప్ప ఆలోచించడం మాయలఫకీరు అద్దంలో చూస్తే అతిలోక సౌందర్యరాశి బాలనాగమ్మ కనిపించినట్లు, మనసు అద్దంలో పరికిస్తుంటే మహాసోగ్గాడు, కాటికి కాళ్ళార జాపిన అందగాడు, ముగ్గురు పెళ్ళాల ముసిలోడు, నలుగురు కొడుకుల తండ్రి, లక్షరూపాయలు బాకీ ఉన్న రైతు, మాదిగ్గేరి సాకె నారప్ప కనిపించాడు.

లేడికి లేచిందే పరుగు అన్నట్లుగా రామప్ప గోసె ఎగదోపుకుంటూ మాదిగ్గేరికి బయలుదేరాడు. ఎండలింకా ముదరలేదు. సాకె నారప్ప తండ్రి లింగప్ప. లింగప్ప తండ్రి నాగలింగప్ప. నాగలింగప్ప చనిపోగా లింగప్ప అన్నదమ్ములు ఆరుగురు పొలం, చేను, తరి పంచుకొంటే ఒక్కొక్కళ్ళకీ పాతికెకరాల భూమి వచ్చింది. లింగప్ప తన పొలం తానమ్ముకోగా మిగిలింది నలుగురు కొడుకులకు నాలుగెకరాలు పంచి ఇచ్చాడు.

నారప్ప, తనకూ, తన తండ్రి సాలు రాకూడదనీ, పొలం అమ్ముకొనే దురుద్దేశ దాపురించరాదనీ, ముందుగానే నారప్ప మేలుకొని తన భాగానికి వచ్చిన నాలుగెకరాలు తన నలుగురు కొడుకులకు, ఒక్కొక్కరికి ఒకొక్క ఎకరం రాసిచ్చాడు. తనకు తన రెక్కల కష్టమే బ్రతుకు దెరువు. చాలు!

ఇక తానా పొలం అమ్మలేదు. ఆయకం పెట్టలేదు. తన చేతులు తానే కట్టేసుకొన్నాడు. తనకు సుఖంగానే ఉంది. కూటికి కొదవ లేదు. గుడ్డకు చింతలేదు. కొంపా గోడు ఉండనే ఉండాయి. అందువల్ల ఇక తనకేం లేదు. భార్యలు పెట్టినా, కోడళ్ళు పెట్టినా, మనుమళ్ళు మనుమరాళ్ళు పెట్టినా తింటున్నాడు. లేకపోతే పస్తులుంటున్నాడు. డెబ్భై ఏళ్ళు దాటింది వయస్సు. తొంభై ఏళ్ళవాడుగా వంగిపోయాడు. అన్నం లేకపోయినా పొరాడుతూనే ఉంటాడుకానీ, బీడి లేకపోతే చచ్చిపోతాడు. నాలిక పీకుతుంది. ఊపిరి ఆడదు. బీడి పొగ లోపలికి పోయిందా, నరాలన్నీ జివ్వుమంటాయి. టివ్వుమంటాయి. నీలుగుతాయి. నిక్కుతాయి. ఆ సమయంలో 'యానా పెల్లం యాడుందని' వెతుకులాడతాడు. తిండి తీర్థం లేకపోయినా 'ఊడికీ తీపరం తగ్గలేదని' ఆడోళ్ళు ముగ్గురు తిడతా ఉంటారు. 'ఈ ముదనష్టపోడితో సచ్చే సావయిందని' శాపనార్థాలు పెడుతుంటారు. 'అందికే గందే మీ ముగ్గుర్నీ మొనువాడింది' అని మొండికేస్తాడు. ముగ్గురు పెళ్ళాల్లో ఎవురో ఒకరు ఓపిక చేసుకోకపోతే, ఇల్లు పీకి పందిరేస్తాడు, గందరగోళం చేస్తాడు. 'సంపుతా నంటాడు, నరుకుతా'నంటాడు. అరిసి గోల పెడతాడు. ఆ రంపు తట్టుకోలేక ఆ కడ్డీరాయుణ్ణి సముదాయించటానికి ఎవరో ఒకరు వస్తారు. పూజ ముగిసినాక ఆ పుణ్యాత్ముడు గాంధీ మహాత్ముడులాగా, ఏసుక్రీస్తులాగా, గౌతమ బుద్ధుడిలాగా, పరమశాంతంగా, మహాసాధు జంతువులాగా ఉంటాడు. ఏడేడు సముద్రాలకవతల మర్రిచెట్టు తొర్రలో ఉన్న చిలక గుండెలో మాయల ఫకీరు ప్రాణం ఉన్నట్లుగా బీడికట్ట అగ్గిపెట్టెలో నారప్ప ప్రాణం ఉందని తెలుసుకొన్న రామప్ప బీడికట్ట అగ్గిపెట్టెతో మాదిగ్గేరిలో ఉండే సాకె నారప్ప ఇంటికి చేరుకున్నాడు.

సాకె నారప్ప కొడుకుల నాలుగెకరాలూ తరే! ఏడాదికి రెండు పంటలు! నలుగురు కొడుకులకు నలుగురు భార్యలుండగా, తండ్రి సాలు వచ్చి, చిన్నోళ్ళిద్దరూ చెరో భార్యను కట్టుకొన్నారు. ఆరుగురు కోడళ్ళు పద్దానుగుమంది మనుమళ్ళను మనుమరాళ్ళను కన్నారు. అందరూ కలసి ఉంటున్నారు. ఒకే పొయ్యి, ఒకే కుండ. ఎవరు ఏం సంపాదించినా, సంపాదించకపోయినా వాళ్ళు కడగాల పోలేదు. తండ్రి చెప్పిన మాట జవదాటరు. ఇంట్లోవాళ్ళు ఏం చెప్పినా విని, ఆలోచించి, మంచి అని తనకు తోస్తే చేయటం, కాదనిపిస్తే మానటం నారప్పకు తెలుసు. ఏం చేయాలన్నా, నలుగురు కొడుకులతో ఆలోచించి చేస్తాడు. చిన్నోళ్ళిద్దరు తెలివిపరులు. పెద్దోళ్ళిద్దరూ పనిమంతులు. నారప్ప గీత గీస్తే అందరూ ఆ గీత లోపలే అణిగి మణిగి ఉంటారు:

బోర్లు ఎండిపోయి తరి లేకపోయినా, వానలు వస్తే సెనిక్కాయ పండి కొంత ఆదరువుగా ఉంది పొలం. మూడేళ్ళుగా వానలు లేక, పంటలు లేక నానా కంగాళీగా ఉంది ఇంటి పరిస్థితి. కొడుకులు నలుగురు అనంతపురంలో నాలుగు పనులు చేసి నాలుగురాళ్ళు సంపాదించినా, బండెడు సంసారం సాగటం కష్టంగానే ఉంది. ఈ మూడేళ్ళలో నారప్పకు కొత్త అప్పులు చేయటం తప్పలేదు. రామప్ప ఇంటికి వంశపారంపర్యంగా చెప్పులు కుట్టి

జీవించే హక్కు సాకే వాళ్ళకే ఉంది. ఆవిధంగా రామప్ప వాళ్ళ పని మాదిగ నారప్పగా మిగిలిపోయాడు. రామప్ప కుటుంబం ఎంత? ఇద్దరు మనుషులే. వాళ్ళకు ఏడాదికి ఎన్ని జతల చెప్పులు కావాలి? నారప్ప ఎన్ని కుట్టగలడు? మునుపు సంవత్సరంలో ఒక్క జత చెప్పులు కుట్టకపోయినా పంటలో భాగం ఇచ్చేవాళ్ళు. రామప్ప హయాంలో పంట భాగం తప్పిపోయింది. పనికి కూలీ ఇవ్వటం ఆరంభమయింది. పైగా రామప్పకు షాపుల్లో చెప్పులు కావలసివచ్చిన షోగ్గాదయ్యాడు. ఏముంది? నారప్ప నోట దుమ్ము!

తనింటి మాదిగ తాను చెప్పినట్టు వింటాడని నమ్మకంతో రామప్ప పొగలేపే బీడీలు, మంట పెట్టే అగ్గిపెట్టే తీసుకొనివచ్చాడు. పైసా పైసా కక్కుర్తిపడే రామప్ప ఇంటికొస్తే ఏమి? ఇంటికి పిలిపిస్తే ఏమి? వీధిలో పలకరిస్తే ఏమి? రామప్పకు ఏ మర్యాద ఇచ్చే స్థితిలో లేదు నారప్ప. మాటవరసకు తాను రామప్ప ఇంటి పని మాదిగే కానీ తన కుటుంబాన్ని కష్టాల్లో ఆదుకొనే బుద్ధి రామప్పకు లేదు. పంట భాగం ఎగరగొట్టాడు. ఇంటి పనిచేయించుకొని ఇంత ఇచ్చి, పెట్టి పోషించే గుణం లేదు. కష్టం వచ్చి సొమ్ము అడిగితే నలుగురికి ఇచ్చినట్లు తనకూ వడ్డీకిచ్చి పత్రం రాయించుకొని ఎంత చెల్లించినా, వడ్డీకి సరిపోయిందని పత్రం తిరగరాయించుకొన్న రామప్ప అంటే నారప్పకు గుర్రుగా ఉంది.

గ్రామంలో ఉన్నవాళ్ళ సంతకాలతోనో, వేలిముద్రలతోనో, బంగారమో, పొలమో, ఇల్లో, పశువులో ఆయకం పెట్టించుకొని వ్రాయించుకొన్న పత్రాలు వందయినా ఆయన ఇంటి అలమారలో దబ్బుతోపాటు మూలుగుతూ ఉన్నాయి. ఆ పత్రాల్లో అప్పుపడ్డ వాళ్ళ సొమ్ము ఏభై లక్షలయినా ఉంటుంది. వడ్డీకి వడ్డీ సంపాదించే ధర్మాత్ముడు వచ్చి నారప్ప ఇంటి ముందు నిలబడేసరికి కడుపు భగ్గుమంది. అరికాలి మంట నెత్తికెక్కింది. స్టూలు మీద కూర్చున్న నారప్ప ఇష్టం లేకపోయినా నిలబడక తప్పని పరిస్థితుల్లో లేచి నిలబడేసరికి, అందువల్ల రామప్ప సంతోషం హద్దులేకుండా ఉంది. అగ్గిపెట్టే, బీడీకట్టా చూచేసరికి నారప్ప నాలిక పీకింది.

'యాం దేవరా యిట్టా యలబారినావు?' అంటే, 'నీగ్గాని ఎరిగ్గాని దేంది వుండాదివై' అన్న రామప్ప వాటిని నారప్పకిచ్చాడు.

మీ తాత ముత్తాతలు గొప్పోళ్ళనీ, నీ తండ్రులు నలుగురూ నాలుగు దిక్కులకు రాజులా కట్ట బతికి నారనీ, నీవు గూడక ఎవుర్నేగాని దేహి అని దేబిరించింది లేదనీ, ఉబ్బేసినాడు.

'సీతాన అప్పు దుద్దు కొండబోలేదా దేవరా'

'లే! అప్పుజేసేది యేరు. అడక్కతినేది యేరు. నువ్వెట్టాటోనివి నికార్సయిన మంచివి'.

నారప్పకు అనుమానంగా ఉంది. 'యేమిరా యీడు ఇయ్యాల ఇట్టా తిరుక్కున్నాడు' అనుకొన్నాడు.

'నీకెంతరా వొగిసు? యనబయ్యో తొంబయ్యోకదేంరా?

'దెబ్బయ్యే దేవుడు!'

'నిజమే లేవై! ముగ్గురు పెళ్ళాలు! బలే కులికినావు కదేంరా?

'యేదోసాఁవి, యట్లో బతుకీడిసినాము'

'మీది పెద్దగుంపే! యంతమందేఁవిరా మీరు?'

'నేను గాక, ఇరవయ్యేడుగురిమి సాఁవి'

'నిన్నిడీ! నీకంతా గొత్తే!'

'మీలో ఎవురేని సాయలేదు. రోగం లేదు. రొచ్చులేదు.

నీకు సావు రాదేంరా దొంగనాకొడకా అనుకొని 'పయోని దయ' అన్నాడు.

'నీ మింద పయోనికి దయే!'

'నీవెంత అప్పుచేసినావో గోత్తేనా?'

'అంతా నీ తానే!'

'నీవోల్లు బాగా బతకాల్లా? వొద్దా?'

'బతకాల్ల సాఁవి'

'వాల్ల పూసీనాది! తిండి, గుడ్డ, వాల్లున్నంత కాలం, ఇంటిలిపాదికి, ఆమీ నాది!'

'మా యిలవేలుపు దేవరా నువ్వు!'

'వేలుపుకి అగుమానం అయితా ఉండాదిరా!'

'అగుమానఁవా? నీకా? నీకేంది దేవుడు?'

'రమణప్ప సేతిలో మీ ఇలవేలుపు ఓడిపోయి నట్టయితే అగుమానం కాదేంలే!'

నారప్పకు అంతా అర్థమయింది. ఇంత యిదిగా ఉంటం యిందికీ అనుకొన్నాడు. పయి సురసుర లాడింది. 'పోలే దొంగనా కొడక' అందామనుకొన్నాడు. అనలేకపోయాడు.

'అప్పులు తీరసల్లా వొద్దా?'

'యట్టో తిప్పలు పడి -

'తిప్పలు పడే పనిలేదువై'

'మడి?' అని, 'వీని యేశాలు నాకాన్నా?' అనుకొన్నాడు.

'రాజశేఖరరెడ్డి తీరుత్తాడు?'

'యాల? ఆయప్ప మాకేంబాకీ!'

'వోనల్లేక, పంటల్లేక, అప్పులు తీరసలేక, పురుగుల మందులు తాగి రైతులు .సత్తే వాళ్లు రొండు లచ్చలిత్తారు. ఒగలచ్చనీది! ఒగలచ్చ నీబాకీ, నాది!'

'అంటే?'

'అప్పు మాఫీ!'

'యాల వాళ్లు ఉద్దరికే దుడ్డు ఇవ్వల్లా?'

'అది వాళ్ల కక్కుర్తి!'

ఇది నీకక్కుర్తి అనుకొన్నాడు నారప్ప.

'నా మాటిను. పురుగుల మందు తాగు. ఇగ నా కొదిలెయ్! యేం జేయాల్నో, యట్టా జేయాల్నో నా కొదిలెయ్!'

నారప్ప బదులాడలేదు. రామప్ప తనింటి మాదిగోని ముఖంలోకి ఎగా దిగా చూశాడు.

'యాంలే?' అని రెట్టించాడు.

'నీ మాట ఏనాడేగాని కాదంటినేమప్పా?'

రామప్పకు పందెం సొమ్ము రొక్కమంతా చేతికొచ్చినట్లే ఆనందం. లక్ష అప్పు తీరినట్లే కుశాలగా ఉంది. మొన్న వాళ్ళ సంభాషణ రామప్పకు గుర్తుకు రాసాగింది.

ఆత్మహత్యలు చేసుకొన్న రైతు కుటుంబాలకు నష్ట పరిహారం ఇస్తామనటం తప్పంటే, కిలో బియ్యం రెండు రూపాయలకే ఇస్తామనటం తప్పు, ఇవ్వలేకపోవం మరీ తప్పు అనటమూ వినిపించింది.వినవచ్చింది ఉచిత కరెంటు ఇస్తాననటం ఇవ్వలేక మూలనబడటం పెద్ద నేరమంటే తమ పార్టీ రైతుల్నే కాంట్రాక్టర్లను చేసి పనులప్పగించి ప్రజల ధనం దుర్వినియోగం చేయటం మరింత ఘోర నేరమవటమూ.

మేఘ మథనం అని చెప్పి కోట్ల ధనం తమ కోటు జేబుల్లో కుక్కు కోవటం ఘోరమంటే; ప్రాజెక్టులు కట్టి, నీటిని నిలవ ఉంచి పొలాలకు పంచి, పంట పెంచి, దేశం సుభిక్షంగా ఉండేటట్లు చేయాలనే సంకల్పం గొప్పనటమూ తెలిసి వచ్చింది.

కాంట్రాక్టుల్లో కమీషన్ల రూపంలో కోట్లు కొట్టేయటానికి వేసిన ఎత్తంటే, పసికిర్ల కళ్ళేనికి లోకమంతా పచ్చగానే, పసుపు పచ్చగానే ఉంటుందనటమూ స్పష్టమయింది. హైదరాబాదు నగరం చుట్టూ ఉన్న భూములన్నీ అప్పనంగా కొట్టేసిన వాళ్ళకి అంతకంటే ఏం తెలుసంటే ఖాళీగా ఉన్న అన్ని భూముల్ని, దేవుని భూముల్ని కూడా వదలకుండా, అమ్ముకొంటున్న వాళ్ళకు అంతకంటే ఏం తెలుస్తుందని వాదించుకోవటమూ అర్థమయింది.

రామప్ప, రమణప్ప వాదులాడుకోవటం ఊరంతా విన్న సంగతి ఎగతాళిగా నవ్వుకొన్న విషయం రామప్ప ఇంకెప్పటికీ మర్చిపోడు.

అక్కడే నిలబడి ఉన్న రామప్పను నారప్ప అడిగాడు.

'సోఁవీ నే జత్తే నీకేందప్పా లాభం?'

'నేను పందెం గెలుత్తా'

'గెలిత్తే?'

'నాకు మూడు లచ్చలొస్తాది!'

'దేవరా! నాకేమప్పా లాభం?'

'నీ బాకీ అంతా అసులు వొడ్డీ తీరుత్తావు!'

'నే జత్తే నీకు నా అప్పు అసులూ వడ్డీ తీరతాయి. ఇంకా మూడు లచ్చలు పందెం సొమ్ము నీ సొంతమయితాది!'

'కరేట్టుగా సెప్పినావురా నారిగా'

ఓరి నా కొడక! అంతలోనే నారిగాణ్ణి అయినానా, అనుకొని దిగులుపడి ఏమప్పా నారప్పా అన్న గౌరవం, మర్యాద పోయినందుకు బాధ పడ్డాడు నారప్ప.

'దేవరా! నే జత్తా! నిన్ను పందెం గెలిపిత్తా. పందెం దుడ్డు నా ఇంటి ఆడోళ్ళకియ్. నా అప్పు మాపీ సెయ్. పత్రాలు సింసి నాకియ్. రైతు సత్తే వొచ్చే దుడ్డు నా కొడుకులకియ్. అట్టయితే సత్తా సుడీ. మాటియ్యమడి! -

'నారిగా' అన్నాడు రామప్ప.

ఓరి నా కొడకా అనుకొన్నాడు నారప్ప.

'నాకేం లాభంరా!'

'దేవరా! నువ్వు పందెం గెలుత్తావా లేదా సోఁవీ!'

'దుడ్డులేని పందెం గెలిసేమీ, గెలవకేమిరా నారిగా'

చివరికి వాళ్ళకు ఒప్పందం కుదిరింది. నారప్ప పురుగులమందు తాగి చచ్చిపోతాడు.రామప్ప పందెం గెలుస్తాడు. పందెం డబ్బు రామప్పది. పరిహారం డబ్బు అంతా నారప్ప కొడుకులది. అప్పు పత్రాలు పురుగులమందుతో పాటు చించి రామప్ప నారప్ప చేతిలో పెడతాడు. సరే అంటే సరే అనుకొన్నారు.

రామప్ప అటుపోగానే రమణప్ప నారప్పను, వెట్టివాణ్ణి పంపి, పిలిపించాడు.

'ఏరా నారిగా' అన్నాడు రమణప్ప.

ఈ నా కొడిక్కి అసలు మర్యాదలేదని దిగులుపడ్డాడు నారప్ప.

'ఏరా సత్తావా?'

'యెట్లో సావాల్నా వొద్దా సోఁవీ'

'సావొద్దురా?'

'యెట్టా బతకాల్లి సోఁవీ!'

నే జత్తే ఆ నా కొడుకు పందెం గెలుత్తాడు. లెక్క వాని సేతి కొత్తాది. నే సాకపోతే ఈ నా కొండెగాడు గెలుత్తాడు. సొమ్ము వీనికయితాది. బతికినా సచ్చినా నాకే మొస్తాది. పిండాకూడు, అనుకొంటూ చేతులు నులుపుకొంటూ నిలబడ్డాడు నారప్ప.

'యేరా నిలబడినావేమి?' సేద్దిగాడు కుర్చీ వేశాడు 'కూసో!' అన్నాడు రమణప్ప.

'వొద్దు దేవరా?' అని మూలకు వొరిగి చేతులు కట్టుకొని వొంగొంగి నిలబడ్డాడు నారప్ప.

'నువ్వు సావగూడదురా! నువ్ జత్తే పరిహారంగా వచ్చే రెండు లచ్చలు నీకు నేనిత్తా. రామప్ప బాకీ లచ్చా తీరుత్తా! ఈ మూడు లచ్చలు పందెం గెలిత్తే ఇది నా కొత్తాది గదేమిరా! ఆ దుడ్డు మొత్తం నీకే యిత్తా! నాకేమీ వొద్దు లేరాబ్బా' అన్నాడు రమణప్ప.

నారప్ప ఆలోచనలో పడ్డాడు. తన కొడుకులతో మాట్లాడి చెబుతానని నారప్ప యెల్లబారి వచ్చినాడు.

'యాఁవయినా సావగూడదురో నారిగా' అనే మాట తోవపొడుగునా వినబడుతూనే ఉంది. 'సత్తే ఈయప్ప యాం జేసునో!' అని నవ్వుకొంటూ నడుస్తున్నాడు. మాదిగ్గేరి వైపు తన మంటి మిద్దె వైపు.

నారప్పకి నవ్వులాటగా ఉంది సత్తే దుడ్డు! బతికితే దుడ్డు! పందేలు వానాయాల్లు గెలసాల్ల! లెక్క నాయింటికి రావల్ల! సిత్రఁవే సిత్రం!

ఆనాకొడుకొత్తాడు, బీడీ కట్టా, అగ్గిపెట్టే తెత్తాడు. ఇత్తాడు. ఈ నా కొడుకు పిలవనంపుతాడు. కురిసీ యేయిత్తాడు. ఎదురుంగా కూసో మంటాడు. కురిసీలో కూసుని కాలుమింద కాలేసుకుంటే యేం జేసునో? యెనుంగొడ్డాకట్టు ఎగురునా? మిడత దూంకిన తీరున దుంకునా? ఏంజేసును?'

నారప్ప నవ్వు కొన్నాడు.

పిలిసినా పలకన్నా కొడుకులు మరేదగా పిలవబట్టినారు. సేతులు బట్టినారు. యేడు మూడు తరాల బందుగులాకట్ట. నేస్తుల్లా, వానెవ్వ, యేం ఇసిక సిత్తరాలు సేత్తన్నారు! అసల్నా కొడుకులు!

వా నా యాల్లు పందేలు గెలసటాంకి నేను జావాల్నా? బతకాల్నా? సావను. యేం జేసుకున్నో సేసుకోనీ వా నా కొడుకుని!

నే జచ్చేది జచ్చేదే! ఈ యప్ప యేం జేసునో జేసుకోంవను.

వోర్నా కొడుకుల్లారా! నే జత్తే వీనికి దుడ్డు! వానికి అగుమానం. నే బతికితే వీనికి లెక్క వానికి ఓటమి. నేను యేనిగా కట్ట. యేనిగ బతికినా లచ్చే! సచ్చినా లచ్చే!

బతికినా, సచ్చినా నాకేంధి వొరుగుతాది? వొనగూడుతాది?

వానికోసం సాయను. దీని కోసరం బతకను. యాం జేసుకుణ్టో జేసుకోంవను

నే సాక పోయినా, బతక్కపోయినా ఈ నా కొడుకులు కాల్లూ గెడ్డం పట్టేవాల్లాకట్టా ఉణ్యారు! యేం చెయ్యల్లప్ప!

ఈ నా కొడుకులు పైస కోసరం పెంట తినేటోల్లు, పేనాలు తీసేటోల్లు.

వాడూ గెలసరాదు. వీడూ గెలస రాదు. వానికి గెలుపు దుడ్డూరారాదు. వీనికీ పందెం లెక్క సెందరాదు ఎట్లా జావల్లప్ప!

నేను జావను, బతకను. వాల్లెవురు సెప్పేకి. నా యిష్టంనాది అని కసిగా, కచ్చగా తిట్టుకొంటూ, తిమ్ముకొంటూ రాసాగాడు. నారప్పకు, చావక, బ్రతక్క ఎలా ఉంటాడో అర్థమయినట్లు లేదు. కసికి, కచ్చకు ఆలోచన ఉండదు కదా.

తాను చనిపోతే మూడు లక్షలు నికరాదాయం. బతికినా అంతే లాభం. అట్టాటప్పుడు చావకుండా బతకటమే మేలు కదా, బతకటం అదనపు విలువ కదా అనుకొంటూ నడుస్తున్నాడు.

ఆ రాత్రి, రమణప్ప నారప్పతో చేసిన సంభాషణంతా విన్న రామప్పకు నిద్ర పట్టలేదు. నిద్రలో పీడకలలు రాసాగాయి. జ్వరం వచ్చినట్లుగా ఉంది. తెల్లారగానే నారప్ప నలుగురు కొడుకుల్ని రామప్ప తన యింటికి పిలిపించుకొన్నాడు.

'ఏరా నాగలింగప్ప, చిన లింగప్ప, నడిపోడ, సన్నోడ యిన్నారేమిరా యీ యిచిత్రం. రమణప్ప మీయప్పను పిలవనంపిచ్చుకుని సావొద్దురా, బతకుతూ సావండిరా, పిల్లా పిసుకును గంజి బోయకుండా గటక లేకుండా సంపమని చెబతాంటే మీ యప్ప గోవు మాలచ్చిమిలా తలాడించి తైతక్కలాడి యింటి దావ పట్టినాడంట యింటిరా?' అని ప్రశ్నించాడు రామప్ప.

విన్నామని కొడుకులు బదులు చెప్పారు. గీతోపదేశం ప్రారంభించాడు. వేదాంతసారం వివరించాడు. ఆత్మ పరమాత్మల సంబంధం తెలిపాడు. చావుపుట్టుకల కథా కమామీషు వివరించి, చస్తూ బ్రతికేకంటే తాను చనిపోయి తన వాళ్ళను బ్రతికించటంలో ఉన్న పరమార్థం వివరించాడు.

"సావటంవో, సంపటమో తప్పదని అర్జునుడికి తెలుసు. చంపినాడా? లేదా? రాం వుడు బాణంవేత్తే ఎవుడేగాని సాయాల్లి! రావణుడు సచ్చినాడా? లేదా? యాదయుద్ధం జేసినా ఎవుడో ఒకడో యిద్దరో, నూరో వేయో, లచ్చో సచ్చేదే! అయినాగాని యుద్ధాలు జరిగినాయా? లేదా? కొట్లాటల్లో పగోల్లే సత్తారని గేరంటీ లేదు. ఏమేగాని కొట్లాడినారా? లేదా?

సచ్చిందెవురు? మొగోల్లు! మొనగోల్లు ఈరులు. పాయపోల్లు. ఎవరి కోసరం? కూటికోసం, గుడ్డకోసం, బందుగుల కోసం, మానంకోసం, మరేదకోసం. జనం కోసం, నేలతల్లి కోసం.

ఇప్పుడెవుల్లు సావల్ల? నారప్ప. నారప్ప ఈరుడా? కాదే! పోటుగాడా? కాదే! పాయపోడా? కాదే! మొనగోడా? కాదే!

మడియాల సావల్ల? పెళ్ళాల కోసరం! కొడుకుల కోసరం! పిల్లలకోసరం.

వాని సావు యేం మూటగట్టు గొత్తది? కూడు! గంజి! దుడ్డు! అంతేనా? అప్పుతీరిపోదా? పోతది.

ఈ యప్పు ఎవురి జనమలో తీరతాది? తీరదు! తీరితే మేలేగాని కీడు కాదుగదా! కాదు!

నారప్పను కాటికీడిత్తే ఎవురికి నొవ్వ? ఎవురకేగాని లేదు. ముసిలాయప్ప, ముదనష్టపోడు బతికింటే తిండి దండగ. సత్తే తిండి ఆదా! పిల్లలు పిసుర్లు తినేకి ఉంటది. నా మాట యింటే మీ యింటి శని, పీడ యిరగడయితాది. ఇనకింటే ఇంటిలిపాదీ సచ్చేది కాయంగా నిజం. సంపేది అచ్చరాల సత్తెం. మడిగ మీరంతా కూడ బలుక్కొని మీమాట సెప్పల్ల.

అప్పటికే తాను నారప్పతో చెప్పిన సంగతి అంతా సవివరంగా తెలిపి, రమణప్ప చూపిన ఆశను వివరించి, తాను మరింత రాయితీ ప్రకటించాడు.

'మీరు, మీ యబ్బాకొడుకులు నా మాట యినుకుంటే యంత మేలో మీ కెరికలేకుండా ఉంది' అంటూ ప్రారంభించి నారప్ప పురుగులమందు తాగిన మరుక్షణం అప్పు పత్రాలు చింపి పారేస్తాననీ, వచ్చే పరిహారం పూర్తిగా కుటుంబానికే ఇప్పిస్తాననీ, రమణప్పతో కాసిన పందెం లెక్క మూడు లక్షలు వాళ్ళకె ఇచ్చివేస్తాననీ, అందువల్ల మొత్తం ఆరు లక్షలు వాళ్ళకు రాబడి అనీ, ఏం చేసినా నారప్ప అంత సొమ్ము మీకు సంపాదించి ఇవ్వలేదనీ, ముసలివాడు చచ్చిపోతే కుటుంబానికి ఏమీ నష్టం లేదని, తాను పందెం గెలిస్తే చాలుననీ, పందెం గెలవకపోతే చచ్చిన శవంతో సమానమని, తనను పందెం గెలిపించటం తన యింటి మాదిగలుగా వాళ్ళబాధ్యత అనీ స్పష్టంగా చెప్పాడు.

'తంవరు సెలవిచ్చినట్టే యినుకుంటామని' మాటిచ్చి నారప్ప నలుగురు కొడుకులు ఇంటికి చేరారు.

తమ తండ్రి ప్రాణం విలువ మూడు లక్షల నుంచి, ఆరు లక్షలకు పెరగటం వింతగా ఉంది.

తేరిపారజూసి, నిదానంగా ఆలోచించి, ఆలస్యం చేస్తే, నారప్ప ఊపిరి రేటు పెరిగేట్టుగానే ఉంది.

రామప్పో, రమణప్పో గెలవటానికి తమ తండ్రి అత్యవసరంగా చావటం అత్యంతావశ్యకమయి నట్లుగా ఉంది.

ఇవాళో రేపో మళ్ళీ రామప్ప తమ తండ్రినో, తమనో పిలిపిస్తాడు. చావమనో, చంపమనో చెబుతాడు.

దుడ్డుకోసం ఆశపడి, తమ తండ్రి చావకపోతే, తామయినా చంపుతామని రామప్ప భావించవచ్చు. పైసాకోసం ఎంతలేకి పనయినా చేసే రామప్ప అట్లా అనుకోవటం అతనికే చెల్లు! తాము దరిద్రులమే, డబ్బుకోసం తండ్రిని చంపుకొనేంత దరిద్రులం కాదు.

పేదలయినంత మాత్రాన, దళితులయినంత మాత్రాన, అప్పులు తీర్చలేకుండా ఉన్నంత మాత్రాన, చావ మంటే చస్తామని, బ్రతకమంటే బ్రతుకుతామని వీళ్ళు నిర్ణయించటం ఘోరంగా ఉంది.

చావో బతుకో నిర్ణయించేది దేవుడే గాని వీళ్లు కాదుగదా!

చావటానికో, బతకటానికో తమ తండ్రికి నారప్పకు స్వేచ్ఛ లేదా?

తండ్రిని చంపమంటే చంపటానికి తాము ఏమన్నా రాజులా రామప్పలా రమణప్పలా? కాదు గదా!

మాకు మా యప్పంటే యంత మాలిమి! యంత గురి యంత యిది! వీల్లకేం దెలుసు తండ్రీ కొడుకుల ఆత్మీయతలు? వీల్లకు ఈ ప్రేమలు పాడూ పరదేసు యేం దెలుసు? కటికి ముండా కొడుకులు!

వీల్లకు మనిసంటే మక్కువలేదు. దేవుడంటే బయింలేదు. లెక్కే ముక్కెం. లెక్కకే లంకే. వానికేం సంపమని దుంకుతాడు? వీనికేం బతకమని బవుపెగ్గలు బలుకుతాడు. వీల్లు - మనుసులయితే సెప్పే దానికయితాది. మానులకు సెప్పేకి అయితాదా? మనిసికొక మాట! గొడ్డుకొక దెబ్బ! వీల్లు మనుషులూ గారు! గొడ్డూ గాదు. తప్పిచ్చుకోవల్ల! యట్టా దప్పిచ్చుకోవాల్లో ఆలోచిచ్చుకోవల్ల!

తాను పందెం గెలవటానికి ఏ ఒక్కరైతు చనిపోయినా చాలు. కానీ ఫలానా రైతు నమ్మకంగా చస్తాడని గేరంటీ ఏమీ లేదు. అందువల్ల నలుగుర్ని సిద్ధం చేసుకోవటం మంచిది. నలుగురు చనిపోయినా ఫరవాలేదు. కనీసం ఒక్కడయినా చచ్చితీరాలి. ఇద్దరిని అప్పటికే సిద్ధం చేశాడు. ఇంకా ఇద్దరి కోసం రామప్ప వెదకసాగాడు. చివరకు నిర్ణయించుకొన్నాడు. వల పన్నాడు. పక్షులు పడతాయని చూడ సాగాడు. ఒక్క చావుకు వందలకొద్ది బహుమతులు ప్రకటించసాగాడు. తన ఆస్తి అంతా పోయినా ఫర్వాలేదు. తాను మాత్రం పందెం నెగ్గాలి. వందలేళ్ళుగా రమణప్ప కుటుంబానిదే పెత్తనం. ఈ దెబ్బతో ఆయప్ప తలదించుకోవాలి. తనది పైచేయి కావాలి. చుట్టుపక్కల అన్ని గ్రామాలలో తన విజయం మారు మ్రోగాలి. తన తరపున చనిపోయిన రైతు కుటుంబాలకు ఇచ్చే పరిహారాలు ప్రకటించాడు. ఆ కుటుంబం తనకున్న అప్పు పత్రాలు చించిపారేయటం, ప్రభుత్వం డబ్బు ఇప్పించటం, పందెం సొమ్ము

వాళ్ళకే ఇచ్చేయటం, పైగా తన సొంత డబ్బు లక్షరూపాయిలు ఎందరు చనిపోయినా అందరికీ ఇవ్వటం ప్రకటించాడు రామప్ప.

ఇంట్లో ఉన్న నాలుగు పురుగు మందుల డబ్బాలు సమీప భవిష్యత్తులో శవాలు కానున్న రైతులకు పంచి యిచ్చాడు. ఏదైనా అత్యవసరం ఏర్పడి విషం కావలసివస్తే అప్పటికప్పుడు వెతుక్కోవటం కష్టం కాబట్టి మరి రెండు కొని తెచ్చి ఇంట్లో పెట్టి ఉంచాడు. తాను గురి పెట్టుకొన్న నాలుగిళ్ళలోని రేపటి శవాలను పరామర్శించి వస్తున్నాడు. తాను అలమరాలో దాచుకున్న డబ్బు అర్ధరాత్రి లేచి చూచుకొని తలుపు మూసి, తాళం వేసి బొడ్లో పెట్టుకొని గుండె మీద చేయి వేసుకొన్నట్లు, గ్రామం అంతంలో దాచుకొన్న లక్షల విలువ చేసే తన శవాలను తనవితీరా చూచుకొని, సంతృప్తిగా గాలి పీల్చుకొని, సంతోషంగా తిరిగి వస్తున్నాడు. శవ సందర్శన భాగ్యం కోసం తాను ఒంటరిగా వెళ్ళి వస్తున్నాడు కానీ, తన వెంట నమ్మిన బంటుల్లాంటి సేవకుల్ని కూడా తీసుకొని వెళ్ళటం లేదు. ఏడు రోజులు గడిచేసరికి నాలుగు శవాలు నమ్మకంగా పందెం గెలిపిస్తాయని విశ్వాసంతో ఉన్నాడు రామప్ప. కానీ ఎందుకయినా మంచిదని మార్గాంతరాలు అన్వేషింపకుండా ఉండటం లేదు.

చంపటం కానీ, చావమని ప్రోత్సహించటం కానీ నేరమని, ఆ నేరం ఆకుతోట పల్లె రామప్ప చేస్తున్నాడని, అందుకు రామప్పను శిక్షించాలని, లేకపోతే అరాచకం సృష్టిస్తాడని, ఆపైన ఏ కీడు మూడినా ప్రభుత్వానిదే బాధ్యత అని, అన్ని దినపత్రికల్లో వార్తలు వచ్చాయి. వార్తలతో పాటు పోలీసు జీపు వచ్చి రావి చెట్టు కింద రచ్చబండ కాడ ఆగింది. రామప్పకు కడుపు మండిపోయింది. రమణప్ప ఇంత పని చేస్తాడా అని పళ్ళు కొరికాడు. కొరికిన పళ్ళు కదిలి కూసాల్లోకి ఊడిపోతాయని ఊరుకున్నాడు.

తానెవరినీ రెచ్చగొట్టటం లేదనీ, ప్రోత్సహించలేదనీ, పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. రాతపూర్వకంగా ఇచ్చాడు. ఊళ్ళో ఎవరూ చావమని ప్రోత్సహిస్తున్నాడని సాక్ష్యం చెప్పలేదు. ఆ నాలుగిళ్ళలో శవాలు కానున్న వాళ్ళు కూడా రామప్పకు వ్యతిరేకంగా పోలీసులతో ఏమీ చెప్పలేదు.

అది గాలి వార్త, నీలి వార్త, పుకారు మాత్రమేనని పోలీసులు విచారణలో తేలినట్లు రిపోర్టు రాసుకొని వెళ్ళిపోయారు. గ్రామ ప్రజలు, పోలీసులు రామప్ప ఇంట్లో మజిలీ చేసి, తాగి, తిని, ఇచ్చింది పుచ్చుకొని వెళ్ళిపోయారు కాబట్టి, కేసుండదని తేల్చుకొన్నారు.

రమణప్పను రామప్పో, రామప్పను రమణప్పో చంపించినా చంపించవచ్చునని, ఊరి ప్రజలు చెవులు కొరుక్కోసాగారు. వాళ్ళిద్దరూ వాళ్ళ జాగ్రత్తల్లో వాళ్ళుంటారని, వీళ్ళకు అంతగా తెలియదు. వాళ్ళిద్దరిలో ఎవరు చనిపోయినా ఓటమి రమణప్పకు, గెలుపు రామప్పకు పందెం వల్ల కలుగుతాయి కాబట్టి రామప్పను రమణప్ప చంపించే ప్రయత్నం చేయడని కొందరు, పందెం ఓడినా, పొగరెక్కిన రామప్పను చంపి చెప్పులోని రాయిని చెవిలోని జోరీగను, కంటిలో

నలుసుని, కాలిలో ముల్లుని లేకుండా రమణప్ప చూచుకొంటాడని కొందరు గ్రామంలో వాదులాడుకోసాగారు.

ఇంతకుముందే రైతు ఆత్మహత్య ఉంటుందని ఉండదని రైతులు పై పందేలు కాసుకొన్నారు. ఇప్పుడు రమణప్ప చస్తాడనీ, రామప్ప చస్తాడనీ రైతులు పై పందేలు చెప్పుకొంటున్నారు. రైతు ఆత్మహత్య జరిగి తీరుతుందని రైతులతో రామప్ప కూడా చాలా పందేలు కాశాడు. ఊరు పందేల మధ్య పరుగులు తీస్తూ ఉంది.

ఉన్నట్టుండి రమణప్ప ఒక నిజాన్నో, పుకారునో నలుగురికీ చెప్పసాగాడు. రామప్ప మొండి మనిషి, పందెం ఓడిపోవటానికి ఏ మాత్రం సిద్ధంగా లేడు, గెలవటానికి ఏ పని అయినా చేస్తాడు. చేయిస్తాడు. ఎవరికయినా బలవంతంగా పురుగులమందు తాగించి చంపవచ్చు. తన నమ్మినబంట్లు అయిన సేవకులతో సేద్దిగాళ్ళతో చేయించవచ్చు. ఎవరూ దొరక్కపోతే ఏ సేద్దిగాన్నో, అనుచరున్నో చంపించినా చంపిస్తాడు.

ఈ మాట గ్రామంలో విషం ప్రాకినట్లు ప్రాకింది. అందరూ భయభ్రాంతులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందోనని గుండెలరచేత పట్టుకొని ఊపిరి పీలుస్తున్నారు.

మాదిగ్గేరిలో సాకె నారప్ప ఇంట్లో ఆడోళ్ళ అరుపులు, పిల్లల ఏడుపులు, మగవాళ్ళ మందలింపులు వాతావరణం గందరగోళంగా ఉంది. నారప్ప ఇంకా పురుగుల మందు తాగలేదు. తాగాలా, వద్దా అని కొడుకుల్ని, కోడళ్ళని, పెళ్ళాల్ని, పిల్లా పిసుకుని అడిగాడు. అది మొదలు ఆ ఇంట్లో ఎవరో ఒకరు ఏడుస్తూనే ఉన్నారు. ఒకర్ని వారిస్తే మరొకరు అందుకొని, ఆరునొక్క శ్రుతిలో రాగం తీస్తున్నారు. ఏడవవద్దనే వాళ్ళ అరుపులు ఏడుపులు కలగలసి గాలికి ఊపిరి ఆడటం లేదు.

విషం తాగితే ప్రాణం మాత్రమే పోతుంది కాని, వచ్చే లాభాలు, లక్ష పత్రం మాఫీ, రెండు లక్షల ప్రభుత్వ పరిహారం, మూడు లక్షల పందెం సొమ్ము. పైగా బోనస్‌గా రిబేటుగా ఒక లక్ష రామప్ప లెక్క. అంతా కలిపితే ఏడు లక్షలు. తాను చస్తే ఇంట్లో జనం ఇరవై ఏడుమంది. ఇరవై ఏడు నక్షత్రాలలాంటి వాళ్ళు. వాళ్ళ గ్రహబలం బాగుంటుంది. అసలే తారాబలం ఉంది. భవిష్యత్తు బాగుంటుంది. తాను బ్రతికి ఉండి ఏం లాభం? తిండి దండగ. పైగా గణుగుడు. ముసలి ముంపు. అన్నీ ఊడినాయి. బతికేమి చచ్చేమి? మీరు ఊ అంటే ఇదిగో తాగి చస్తానని నారప్ప తీవ్ర సంకల్పం ప్రకటించాడు.

పెళ్ళాలు వాటేసుకొని ఏడుస్తున్నారు. పిల్లలు నేల మీద పొర్లి పొర్లి దుఃఖిస్తున్నారు. కోడళ్ళు గోడలకు జేరబడి ముక్కుతూ, మూలుగుతూ చీదుతూ మూతులు తుడుచుకొంటూ ఉన్నారు. పెద్దోళ్ళిద్దరూ సాకె నాగలింగప్ప, సాకె లింగప్ప, కలో గంజో తాగి బతుకుదాం ఆడి డబ్బేం జేసు? ఆడి బతుకేం జేసు? ఆడెంత; ఆడి బిసాదెంత? ఎవుడి లెక్కో మనకేలా? మన

రెక్కల కష్టం మనకు సాలు' అని తేల్చి చెప్పారు. నడిపోడు మాత్రం 'నువ్వన్నీ తెలిసినోనివి నీకి మేం జెప్పేటోల్లమా? నువ్వు నీ బుద్ధికి తోసినట్లు సెయ్ నాయినా' అన్నాడు. 'సావమంటావురా!' అంటే 'నువ్ జత్తావా? జావ్వు!' అన్నాడు. 'ఇదిగో సత్తా' అని పురుగుల మందు మూత తీస్తుంటే 'నీ కత నాకు సెప్పొద్దులెయ్' అని మందుడబ్బీ తీసి అంగి లోపలి జేబులో వేసుకొని, అనంతపురంలో సద్దాం పద, లెయ్' అని లేపి తీసుకుపోయాడు సన్నోడు. సన్నోడు ముద్దుల కొడుకు. ఆడికింత తెలివెక్కువ. తండ్రి నిక్కులు ట్రిక్కులు అన్నీ వాడికి సుప్తాగా తెలుసు. సన్నోడూ నారప్పా ఆ రాత్రే అనంతపురం వెళ్ళిపోయారు.

పొద్దున్నే నిద్రలేచిన రామప్పకు సుప్రభాతంలాగా, చావు వార్త చల్లాగా వినబడింది. అది బాగా ప్రచారమయింది. పందెం గెలవటానికి రామప్ప ఎవరికో పురుగులమందు తాగించి చంపుతాడని ఉన్నమాటో ఉత్తుత్తిమాటో పురుగులమందు లాగా గప్పున వాసన కొట్టింది.

వడ్డె వెంకటరాముడు రామప్పకు మాట ఇచ్చిన పెద్ద మనిషి. పలకరిద్దామని ఇంటికిపోతే ఇంట్లో 'యాఁవయి నాదమ్మయ్యా' అంటే 'యాఁమొనప్ప తెలియ'దనింది వెంకటరాముడి భార్య. మందు టిన్ను వెంట తీసుకొని పోయాడంది.

రామప్ప మాట నెగ్గించ గలిగినోడు బోయ సుబ్బరాయుడు. వాళ్ళిద్దరు కలిసి చదువుకొన్నారు. మంచి దోస్తీ. ఈ కష్టం నుంచి నువ్వే నన్ను గట్టెక్కించాలని, ఈ పందెం నువ్వే గెలిపించాలని రామప్ప అర్థించాడు. పిల్లా పీచులేని సుబ్బరాయుడు మిత్రుడి గెలుపు కోసం పాటుపడతానని మాట ఇచ్చాడు. మాట నిలబెట్టుకొనే మనిషి.

ఫకీరప్ప ఇంటి చిలుక్కి కప్ప వేలాడతా ఉంది. 'యాఁడికి బోయినారంటే' పక్కింటోళ్ళు 'యాఁవో' నన్నారు. ఆడోళ్ళు అతణ్ణి వెంటతీసుకొని పోయారు. ఎక్కడో చంపి శవాన్ని చూపుతారని నమ్మకంతో ఉన్నాడు రామప్ప.

మాదిగ్గేరిలో నారప్పని సన్నాయప్ప అనంతపురం తోలుకొని పోయాడని ఇంట్లో వాళ్ళు చెప్పగా ఆడోళ్ళు ఏడుస్తుంటే నారప్ప గేరంటీ శవంగా భావించుకొని, సన్నోడు తెలివైనోడని, అంత డబ్బు వస్తుంటే ఆ ముసిలోడు పైలోకానికి పోతే పోనీయ్‌లే అని సాగనంపటానికి అనంతపురం తీసుకుపోయాడని తీర్మానించుకొన్నాడు.

ఆ నాలుగు శవాలూ తన సొంతం. వాటితో తనిష్టం. తనిష్టం జరక్కుండా చూచే మగాడే లేడు. రమణప్ప అంత మగాడేం కాదు. గేరంటి. ఓడిపోతాడు. తాను పందెం గెలుస్తాడు. తనకు తిరుగులేదు. ఎన్ని పుకార్లు పుట్టిస్తాడు? ఎన్ని పుత్రేపులు పెడతాడు? ఎట్టా నెగ్గుకొస్తాడు? చూస్తాను. వీడి ఓటమి నిశ్చయం.

హత్యలు చేస్తాననీ, చేయిస్తాననీ ప్రచారం చేస్తాడా? చేయిస్తే ఏం చేస్తాడు? హత్య చేయించి, ఆత్మహత్యగా చిత్రించి, కేసు మాఫీ చేయించి, ఆత్మహత్యకు పరిహారం తెప్పించకపోతే

తన పేరు రామప్ప కాదని తనకు తానే ప్రతిజ్ఞ చేసుకొన్నాడు. ఎంత ఖర్చు అయినా భయం లేదని నిర్ణయించుకొన్నాడు.

ఇంటికొచ్చి చూస్తే పరిస్థితి ఎంతో గుంభనంగా ఉంది. ఊళ్ళో జనం సగం మంది లేరు. తనకు అప్పుపడ్డవాళ్ళు ఎవళ్ళూ కనిపించటం లేదు. సగం ఊరు ఖాళీ అయింది. వీళ్ళేవుళ్ళయినా రమణప్ప పుకార్లు నమ్మి ఇల్లిడిసి, ఊరిడిసి పోయారా అని అనుమానం రాసాగింది. అప్పున్నవాళ్ళు కానీ, బలహీనులు కానీ, చిన్న సన్న రైతులు కానీ, మాదిగ్గేరిలో మగాళ్ళు కాని, సాయిబుల్లో మగాళ్ళు కానీ, దూదేకుల వాళ్ళలో పురుషులు కానీ ఎవరూ గ్రామంలో లేరు. రమణప్ప చేసిన ప్రచారం జనం నమ్మారని తనకు విశ్వాసం కలగసాగింది. ఇంట్లో జీతగాళ్ళు లేరు. సేద్దెగాళ్ళు లేరు. నమ్మినబంటు లాంటి అనుచరులు లేరు. అందరూ మాయమయ్యారు. రామప్పకు పరిస్థితి పూర్తిగా అవగాహనలోకి వచ్చింది.

సాయంకాలానికి ఆకుతోటపల్లె శవాలు చుట్టుపట్టుల ఏదో దొరుకుతాయని రామప్ప నమ్మకంగా ఉన్నాడు. తన జీతగాళ్ళు, సేద్దెగాళ్ళు, పనోళ్ళు, కూలోళ్ళు తనని నమ్మకుండా పారిపోయేట్లు చేసిన రమణప్ప ఓటమి ఖాయం అనుకొన్నాడు. పల్లెలో మగాడే లేడు. ఆడోళ్ళు పిల్లోళ్ళు మిద్దెల్లో దాక్కున్నారు. తాను చంపుతానని వీళ్ళంతా భయపడుతున్నట్లు ఉన్నారు. నిజంగా చంపితే ఏం చేస్తారు? రమణప్ప ఏం చేయగలడు? ఎవరిని చంపాలి? ఎట్టా చంపాలి? ఆలోచించుకోసాగాడు రామప్ప.

ఆ సాయంకాలానికి రమణప్ప పల్లెలో ఉన్న ఆడవాళ్ళని, పిల్లవాళ్ళని, తన యింటికి పిలిపించుకొన్నాడు. వంట ఏర్పాట్లు చేశాడు. తిని ఆడే పడుకోమని చెప్పాడు. ఎందుకు? బయట ఎవరు కనిపించినా పట్టుకొని తీసుకొనిపోయి రామప్ప చంపబోవచ్చు. ఆ బందీ భర్తో, తండ్రో పరుగు పరుగున రావచ్చుననీ, అతన్ని బంధించవచ్చుననీ, తెల్లారేలోగా పురుగుల మందు తాగించి చంపవచ్చుననీ, రైతు ఆత్మహత్య శవాన్ని చూపవచ్చుననీ రామప్ప వ్యూహమని రమణప్ప వివరించాడు.

ఊరు నిర్మానుష్యంగా ఉంది. అప్పటికయినా తన శవాలుగానీ, శవాలు కానున్న మనుషులుగాని వస్తున్నారేమోనని రోడ్డు దాకా దృష్టి సారించాడు రామప్ప. ఏ కదలికా లేదు. నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉన్న ఊరిని చూస్తుంటే వల్లకాటిని చూపిస్తున్నట్లుంది. ప్రాణి సంచారం లేక గ్రామం భయంకరంగా ఉంది. కుక్కలు కూడా తిరగటం లేదు. పసుల్ని కట్టేశారు. గ్రామం గ్రామం ఇంత భయం కలిగించగలదని రామప్ప ఊహించలేదు.

చీకటి పడుతున్నప్పుడు ఊరంతా తిరిగి చూచి వచ్చాడు. ముఖ్యంగా వెంకటరాయుడు, సుబ్బరాయుడు, పకీరప్ప, నారప్పల ఇళ్ళు దొడ్లులు పరకాయించి చూశాడు. పురుగు అలికిడి కూడా లేదు. ఏ ఇంట్లోనూ లైటు వేయలేదు. దీపం ముట్టించలేదు. వీధిలైట్లు ఒంటరిగా భయంగా వెలుగుతున్నాయి. ఊరంతా తిరిగి రామప్ప ఇంటికి వచ్చేసరికి బాగా చీకటి పడింది.

సూర్యోదయమయితే గెలుపు ఓటములు తేలిపోతాయి. ఈ ఒక్కరాత్రే సమయం.

రమణప్ప సేద్దెగాళ్ళు, పనోళ్ళు తప్ప మగవాళ్ళు ఎవరూ ఊళ్ళో లేరు. ఉన్న మగవాళ్ళు వంటా నార్పు పనిలో రమణప్ప ఇంట్లోనే ఉన్నారు. అక్కడ మాత్రమే లైట్లు వెలుగుతున్నాయి. జనం కదిలాడుతున్నారు. తన ఇంట్లో వంట చేసేవాడు కూడా లేడు. రామప్ప భార్య వంట పనిలో ఉన్నట్లుగా ఉంది. లైట్లు వేయలేదు. ఇల్లు చీకటిని వాటేసుకొని, కప్పుకొని పడుకొని ఉంది.

పందెం ఓడిపోతానన్న దిగులు కంటే మోసపోయానన్న చింత రామప్పను పీడించసాగింది. రమణప్ప తనను ఓడిస్తున్నాడన్న వ్యథ కంటే తన మీద ఆధారపడ్డ జనం తనను ఒంటరివాడిని చేశారన్న బాధ హింసగా ఉంది. తాను మోసపోయినట్లు, కుయుక్తి జరిగినట్లు, తనకంటూ ఎవరూ లేకుండా పోయినట్లు గుర్తించి కుమిలిపోసాగాడు.

ఎవరైనా వాడి చావు వాడు చస్తే చస్తాడు కానీ, మరొకడి పందెం కోసం, పంతం కోసం, పట్టుదల కోసం ఎవడూ చావడన్న సత్యం రామప్పకు తెలిసి రాసాగింది. బతికిస్తానంటే పదిమంది వెంట ఉంటారు కానీ చంపుతానంటే ఉండరని గుర్తించలేకపోయాడు. బతకమంటే బంధువు, చావమంటే శత్రువు అని తెలుసుకోలేక పోయాడు. జనం బ్రతకటానికి ఇష్టపడతారు సిద్ధమవుతారు కాని చావటానికి కాదని రామప్పకు అర్థం కాసాగింది. లెక్క ఉంటే ఏ పని అయినా సాధించవచ్చునన్న నమ్మకం తప్పని స్పష్టమవుతూ ఉంది. దుడ్డు అన్ని సాధించలేదని, ధనాశ బ్రతుక్కేకాని, చావుకు కాదనీ తెలిసే లోపల చేతులు కాలాయి.

రామప్ప భార్య రెండుసార్లు చీకట్లో కూర్చున్న భర్తను చూచిపోయింది. ఆమె అతణ్ణి సాధారణంగా పలకరించదు. అతడే ఆమెను పిలుస్తాడు. పలకరిస్తాడు. పని చెబుతాడు. అంతే ఆమె మాట్లాడదు. రామప్పకు నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి అయినా ఊళ్ళోకి మనిషి వస్తున్నట్లుగానీ, పోతున్నట్లుగానీ ఏ అలికిడీ లేదు. భయంతో, బాధతో, అర్ధరాత్రి ఒంటరిగా దింపుడుగల్లం ఆశతో గ్రామంలో ఏ రైతు శవం అయినా ఉందేమోనని చూచివచ్చాడు. శూన్యం.

రామప్ప భార్య మరి రెండుసార్లు వచ్చి చూచి, పలకరించటానికి భయపడి వెనుదిరిగిపోయింది. రామప్ప నిద్రపోలేదు. శూన్యంలోకి చూస్తున్నాడు. ఓడిపోవటం ఇష్టం లేక గింజుకులాడుతున్నాడు. ఎంత డబ్బు పోయినా ఫరవాలేదు. రైతు శవం కావాలి. లేచి అటు ఇటూ తిరిగాడు. దూరం నుంచి రమణప్ప ఇల్లు వెలుతుర్లో కనబడుతూ ఉంది. పండగలాగా ఉంది వాళ్ళకు. పందెం గెలవకముందే పండగా? రమణప్ప ఓడిపోతాడు. ఓడి తీరతాడు. కాకులరుస్తున్నాయి. మూగ వెలుతురు వస్తూ ఉంది. సూర్యోదయం భయం కలిగిస్తూ ఉంది.

తన శవాలుండవలసిన నాలుగిళ్ళకూ బయలుదేరి వచ్చాడు రామప్ప. ఎన్నడూ లేంది కాళ్ళు వణుకుతున్నాయి. ఊరి చుట్టూ తిరిగి వచ్చాడు. నాలుగు శవాల ఆచూకీ లేదు. నాలుగిళ్ళలో మనుషుల్లేరు. దీపాలు లేవు. వాకిళ్ళు వేసి ఉన్నాయి. తాళం కప్పలు వేలాడుతున్నాయి.

కోపం వచ్చింది. జనం మోసం చేశారని దుఃఖం వచ్చింది. రమణప్ప గెలుస్తాడని ఉక్రోషం వచ్చింది. తీరని ఆవేదన కలిగింది. రామప్ప కోపంతో ఊగిపోతూ ఇల్లు చేరాడు.

రాత్రంతా భర్తను గమనిస్తున్న భార్య తెలవారుతున్నప్పుడు మాగన్నుగా నిద్రపోయింది. రామప్ప అలమరా తీసి, తనఖా పత్రాలు, ప్రాంసరీ నోట్లు, వెండి బంగారు నగలు, నగదు పక్కనే పెట్టి ఉన్న రెండు పురుగుల మందు టిన్నులు, బట్టలు, తాకట్టు నగలు, అన్నీ తేరిపార చూచుకొన్నాడు. అన్నీ సరిగ్గా ఉన్నాయని గమనించి తలుపులు దగ్గరకు వేశాడు.

సూర్యోదయం కాగానే పసువులు లేచాయి. కాకులు కావు కావు మన్నాయి. కుక్కలు తోకలాడిస్తూ జాడిస్తూ తిరగసాగాయి. పిల్లలు ఉత్తబిత్తలతో ఎగుర్లాడుతున్నారు. ఆ మసకలో ఆడవాళ్ళ అడుగుల చప్పుళ్ళు, గాజుల గలగలలు వినిపిస్తున్నాయి. బోరింగు కొడుతున్న టంగు టకాలు మారుమోగుతున్నాయి. మగవాళ్ళు ఒక్కొక్కళ్ళు ఊళ్ళోకి రాసాగారు. పొద్దు పొడవగానే రమణప్ప ఇంట్లో లైటు వెలగటం ఆగిపోయింది. రామప్ప ఇంట్లో సూర్యుడి వెలుతురు పడుతూ ఉంది. తలుపులు బార్లా తీసి ఉన్నాయి. భార్యాభర్తలు ఎవరి గదిలో వాళ్ళు ఎవరి మంచం మీద వాళ్ళు ఉన్నారు.

పది గంటలకు వెంకటరాయుడు, సుబ్బారాయుడు, పకీరప్ప, నారప్ప ఒకే వేప చెట్టు పుల్లలు విరుచుకొని నములుతూ పళ్ళు తోముకొంటూ ఉన్నారు. ఆ సమయానికి ఊళ్ళో వాళ్ళంతా ఊళ్ళోనే ఉన్నారు. అందరూ గుసగుసలాడుతున్నారు. తెలిసినవాళ్ళు, తెలియనివాళ్లకు తెలియజెప్పుతున్నారు. తెలియనివాళ్ళు అడుగుతున్నారు. విని అర్థం చేసుకొంటున్నారు. ఏం జరిగిందంటే ఏం జరిగిందని రహస్యం బాహాటంగా బట్టబయలుగా చెప్పుకొంటున్నారు. తెగిన పొట్టేళ్ళ మాంసం అన్ని ఇళ్ళకూ చేరి కూరవుతూ మసాళా వాసన ఊరంతా గుప్పుమంటూ ఉంది.

యమ్మార్వో పోలీసులతో వచ్చాడు. తీసి ఉన్న రామప్ప ఇంటి వాకిళ్ళు దాటి వాళ్ళు లోపలికి వెళ్ళారు. ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. జీతగాళ్ళు, సేద్దెగాళ్ళు, పనివాళ్ళు ఎవరూ లేరు.

అలమరా తీసి ఉంది. వెండి బంగారం తాకట్టు నగలేమీ లేవు. ప్రాంసరీ నోట్లు, దస్తావేజులు ఒక్కటీ కనిపించలేదు. అలమరా పూర్తిగా ఖాళీగా ఉంది. కట్టలు కట్టలుగా ఉండవలసిన నగదు కనిపించటం లేదు. ఒక్క పురుగుల మందు టిన్ను మాత్రమే అలమరాలో దిష్టిబొమ్మలాగా ఉంది. రెండో పురుగుల విషం టిన్ను ఖాళీగా రామప్ప చేతిలో ఉంది.

రామప్ప భార్య నిద్రలేచి వచ్చింది. ఇంత అలికిడి అవుతున్నా రామప్ప లేచి, 'ఏమిటిదంతా' అని అడగలేదు.

చేయవలసిన తతంగమంతా పూర్తి చేసి పోలీసులతో యమ్మార్వో జీపు ఎక్కి వెళ్ళిపోయాడు. ఊరు నిశ్శబ్దంగా ఉంది.